www.vishalabharati.com
epaper:vishalabharati.com

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

ఆదివారం, 9.06.2024, హైదరాబాద్ | సంపుటి: 2, సంచిక: 237

## మంత్రుల పెట్టుబడుల వేట

- అమెరికాలోని అట్లాంటలో పర్యటిస్తున్న మంత్రులు
- తెలంగాణలో కంపెనీలు పెట్టాలని పెట్టుబడిదారులకు ఆహ్వానం
- రాష్ట్రంలో ఎక్కడ ఏర్పాటు చేసిన మాకు ఓకే
- మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి

2




936 నవంబర్ 16న కృష్ణా జిల్లా పెదపారుపూడిలో చెరుకూరి వెంకటసుబ్బారావు, సుబ్బమ్మ దంపతులకు రామోజీరావు జన్మించారు. అక్కలు రాజ్యలక్ష్మి, రంగనాయకమ్మ తర్వాత ఆయన జన్మించారు. కుటుంబసభ్యులు రామోజీకి.. తాతయ్య రామయ్య పేరు పెట్టారు. బడిలో మాస్టారుకు తన పేరు రామోజీరావు అని చెప్పి.. తన పేరును తనే పెట్టుకున్నారు. చిన్నప్పటి నుంచే విలక్షణ, సృజనాత్మకత ఉన్న వ్యక్తి ఆయన. ఈనాడు దినపత్రికను ప్రారంభించి తెలుగునాట సంచలనం సృష్టించారు. 1974 ఆగస్టు 10న విశాఖ సాగర తీరంలో 'ఈనాడు'ను ప్రారంభించారు. ప్రారంభించిన నాలుగేళ్లలోనే పాఠకుల మానసపుత్రికగా ఈనాడు మారింది. ఈనాడుతో పాటు కీలక మైలురాయిగా 'సితార' సినీ పత్రిక నిలిచింది.

## అక్షరం.. అస్తమయం

వివరాలు 2 లో

- దివికేగిన మేరునగధీరుడు
- మీడియా మొఘల్ ఇకలేరు
- తీవ్ర అనారోగ్యంతో కన్నుమూత
- ఫిల్మ్ సిటీలోని నివాసానికి పార్థివదేహం
- అన్ని రంగాల్లోనూ నంబర్ 1
- తెలుగులోనే ఈటీవీకి 12 చానళ్లు

### వ్యక్తి కాదు.. వ్యవస్థ







## నితీశ్‌కు... ప్రధాని అవకాశం

### ఇప్పట్లో కూటమి చేంజ్ కాము

- ఇండీ కూటమి నుంచి వచ్చింది
- అయినా మేం వెళ్లలేదు
- జేడీయూ నేత కేసీ త్యాగి

**విశాలభారతి, నేషనల్ బ్యూరో :** కేంద్రంలోని భాజపాను ఓడించడమే లక్ష్యంగా ఏర్పడిన 'ఇండియా' కూటమి బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ కు ప్రధాన మంత్రిగా ఆఫర్ ఇచ్చినట్లు జేడీ(యూ) వర్గాలు వెల్లడించాయి. అయితే, ఆయన మాత్రం ఆ ఆఫర్‌ను తిరస్కరించినట్లు తెలుస్తోంది. ఆ పార్టీ నేత కేసీ త్యాగి ఓ జాతీయమీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. "ఇండియా కూటమి నీతీశ్ కుమార్‌కు ప్రధాన మంత్రిగా ఆఫర్ ఇచ్చింది. ఆయన మాత్రం ఆ అవకాశాన్ని తిరస్కరించారు. దీని గురించి నేరుగా నీతీశ్‌ను కలిసేందుకు కొందరు నేతలు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం మేము ఎన్డీయే కూటమితో ఉన్నాం. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసే ప్రసక్తే లేదు" అని త్యాగి పేర్కొన్నారు. ఎగ్జిట్ పోల్స్ అంచనాలకు భిన్నంగా సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ఎన్డీయే కూటమి 293 సీట్లు సాధించగా.. ఇండియా కూటమి ఆ అంచనాలకు మించి 234 స్థానాలను సొంతం చేసుకుంది.

### అత్యాచారాలు, హత్యలు జరిగినా మీకు ఫర్వాలేదా? కంగనా ఆగ్రహం

ఈ క్రమంలోనే కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసుకునేందుకు ఇండియా కూటమి తన సంఖ్యా బలాన్ని పెంచుకునేందుకు తీవ్రంగా ప్రయత్నించిందని వార్తలు వినిపించాయి. అందుకోసం ఎన్డీయే మిత్రపక్షాలైన తెలుగు దేశం పార్టీ, జేడీ(యూ)లను తమ కూటమిలో చేర్చుకునేందుకు యత్నించిందని ఊహాగానాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నీతీశ్‌కు వచ్చిన ఆఫర్ గురించి తాజాగా పార్టీ నేత చేసిన

....మిగతా 3 లో

## బోడుప్పల్ రెండో డివిజన్‌లో...

## అడుగడుగునా అక్రమ నిర్మాణాలే..



- అధికారుల మౌనం...అనేక అనుమానాలు
- ప్రైవేటు వ్యక్తి జేబులోకి కార్పొరేషన్ ఆదాయం
- మున్సిపల్ ఆదాయానికి భారీగా గండి

7



## నేడు మోదీ పట్టాభిషేకం

- మూడోసారి ప్రధానిగా ప్రమాణం చేయనున్న మోదీ
- జవహర్‌లాల్ నెహ్రూ రికార్డు సమం చేయనున్నారు
- హాజరుకానున్న వివిధ దేశాధినేతలు

3

## నీట్ పరీక్ష ఫలితాలపై.. విచారణ జరిపించాలి

- నీట్ పరీక్షపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి : కేటీఆర్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో :** నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై హైలెవల్ ఎక్స్‌పర్ట్ కమిటీతో విచారణ జరిపించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్‌కు సంబంధించిన కీలమైన నీట్ పరీక్షపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కేటీఆర్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. వైద్య విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేసే నీట్ ఎగ్జామ్‌కు సంబంధించి కొన్ని వ్యవహారాలు చూస్తూ కచ్చితంగా అవకతవకలు జరిగినట్లు స్పష్టమవుతుందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఈ సంవత్సరం నీట్ ఎగ్జామ్లో 67 మంది విద్యార్థులు 720 కి 720 మార్కులతో ఫస్ట్ ర్యాంక్ సాధించటం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. కొత్తగా ఏర్పడిన ఎన్డీయే సర్కార్ రానున్న రోజుల్లో ఇలాంటి సమస్యలకు సంబంధించి చాలా సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. నీట్ ఎగ్జామ్ విషయంలో బీఆర్ఎస్ తరఫున పలు పశ్నలతో పాటు కొన్ని డిమాండ్లను కేంద్రం ముందుంచారు.

## నేడే గ్రూప్ 1

- పరీక్ష రాయనున్న 4.03 లక్షల మంది
- పకడ్బందీగా ఏర్పాట్లు



**విశాలభారతి,ఆంధ్రప్రదేశ్ :** తెలంగాణలో జూన్ 9న నిర్వహించనున్న 'గ్రూప్-1' ప్రిలిమ్స్(స్క్రీనింగ్ టెస్ట్) నిర్వహణకు టీజీపీఎస్సీ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. రాష్ట్రవ్యాప్తంగా 4.03 లక్షల మంది అభ్యర్థులు హాజరుకానున్న ప్రిలిమ్స్ పరీక్ష కోసం 895 కేంద్రాలను ఏర్పాటుచేశారు. జూన్ 9న (ఆదివారం) ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓఎంఆర్ విధానంలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిధిలోనే అత్యధికంగా 105 పరీక్ష కేంద్రాలను ఏర్పాటుచేశారు. పరీక్ష సమయానికి గంటన్నర ముందునుంచే (ఉదయం 9 గంటల నుంచి) అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. పరీక్ష ప్రారంభానికి అరగంట (ఉదయం 10 గంటల) ముందే గేట్లు మూసివేస్తారు. అభ్యర్థులు హాల్‌టికెట్, ప్రశ్నపత్రంపై ముద్రించిన సూచనలు తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. పరీక్షలో పాటించాల్సిన సూచనలకు సంబంధించి అభ్యర్థులను అలర్ట్ చేస్తూ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎస్ఎంఎస్లు పంపిస్తోంది.

### పరీక్ష విధానం..

మొత్తం 150 మార్కులకు గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించనున్నారు. జనరల్ స్టడీస్ %డ% మెంటల్ ఎబిలిటీ

....మిగతా 2 లో

విశాల భారతి
GENERAL NEWS
Vishalabharathi Telugu Daily
www.ishalabharathi.com
epaper: vishalabharathi.com
జనరల్ న్యూస్ 2
ఆదివారం
9.06.2024
హైదరాబాద్

# అక్షరం.. అస్తమయం

**విశాలభారతి,స్టేట్ బ్యూరో :**

ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ చెరుకూరి రామోజీరావు(88) కన్నుమూశారు. ఈ నెల 5న ఆయనకు శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదురవడంతో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన శనివారం తెల్లవారుజామున 4.50 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఫిల్మ్‌సిటీలోని నివాసానికి ఆయన పార్థివదేహాన్ని తరలించారు.

### కొత్త దారులు సృష్టించడం ఆయన నైజం..

బహుముఖ ప్రజ్ఞ.. కఠోర సాధన.. ఇవే రామోజీ అస్త్రాలు. నలుగురు నడిచిన బాట కాదు.. కొత్త దారులు సృష్టించడం ఆయన నైజం. లక్ష్య సాధనకు దశాబ్దాలపాటు నిర్విరామంగా పరిశ్రమించిన యోధుడు. రైతుబిడ్డగా మొదలై వ్యాపారవేత్తగా రాణించారు. మీడియా మహా సామ్రాజ్యాన్ని నిర్మించిన రామోజీరావు.. చైతన్యదీప్తుల్లాంటి చిత్రరాజాలను సృజించారు. అద్భుత ఫిల్మ్‌సిటీని సృష్టించారు. తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వేశారు. ఆఖరి క్షణం వరకూ ప్రజా శ్రేయస్సు కోసమే పరితపించారు. పనిలోనే విశ్రాంతి అనేది ఆయన ప్రాథమిక సూత్రం. చివరి క్షణం వరకు పనిలోనే విశ్రాంతి సిద్ధాంతాన్ని పాటించిన మహనీయుడు.

### వేల మందికి ఉద్యోగ, ఉపాధి..

అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ ఆయన చెరగని ముద్ర వేశారు. 1962లో మార్గదర్శి చిట్‌ఫండ్స్‌ను స్థాపించారు. దేశంలోనే అగ్రశ్రేణి చిట్‌ఫండ్స్ సంస్థగా మార్గదర్శి నిలిచింది . 60 ఏళ్లలో లక్షలాదిమంది ఖాతాదారులకు నిబద్ధతతో సేవలు అందించారు. ఈ సంస్థ ద్వారా వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించారు.

### బుల్లితెరపై రికార్డ్..

చెరుకూరి రామోజీ రావు.. రామోజీ గ్రూప్ అనే అతిపెద్ద సంస్థను స్థాపించారు. ఈ సంస్థ ద్వారా ఎంటర్‌టైన్మెంట్ నుంచి ఎడ్యుకేషన్ వరకు మరెన్నో సంస్థలు ప్రారంభమయ్యాయి. 1936 నవంబర్ 16న జన్మించిన రామోజీ రావు.. స్వయంగా ఈనాడు వార్తా పత్రిక, ఈటీవీ నెట్‌వర్క్, ఉషాకిరణ్ మూవీస్ ప్రొడక్షన్ హౌజ్, ఈటీవీ భారత్‌ను ప్రారంభించారు. ముందుగా 1974లో విశాఖపట్నంలో ఈనాడు వార్తా పత్రికను ఆరంభించారు. ఆ తర్వాత ఈటీవీ నెట్‌వర్క్ ప్రారంభమయ్యి ఇది పూర్తిగా 8 భాషల్లో విస్తరించింది. కేవలం తెలుగులో ఈటీవీకి 12 ఛానెల్స్ ఉన్నాయి. ఈ ఛానెల్స్ ద్వారా ఎంతోమంది సీరియల్ ఆర్టిస్టులు బుల్లితెరకు పరిచయమయ్యి, ప్రేక్షకులకు దగ్గరయ్యారు.

### ఎన్నో అవార్డులు..

ఈటీవీ ఛానెల్‌తో బుల్లితెరను శాసించిన రామోజీ రావు.. ఉషా కిరణ్ మూవీస్‌తో వెండితెరపై కూడా అడుగుపెట్టారు. ఈ ప్రొడక్షన్ హౌజ్ ద్వారా ఎన్నో భాషల్లో దాదాపు 80కు పైగా సినిమాలను నిర్మించారు. ఇక కొన్నేళ్లుగా డిజిటల్ మీడియా అనేది ట్రెండింగ్‌లోకి రావడంతో, ప్రజలంతా దాన్నే ఫాలో అవ్వడంతో రామోజీ రావు కూడా ఈటీవీ భారత్ అనేది ఒక డిజిటల్ యాప్‌ను తయారు చేయించారు. ప్రారంభించిన కొన్నిరోజుల్లోనే బాగా పాపులర్ అయిన ఈటీవీ భారత్.. ప్రస్తుతం 24 రాష్ట్రాల్లో 13 భాషల్లో వార్తలను ప్రజలకు అందిస్తోంది. ఇక రామోజీ రావు పేరున ఎన్నో అవార్డులు కూడా ఉన్నాయి. 2016లో ఆయనుకు పద్మ విభూషణ్ పురస్కారం దక్కింది. 2000లో ఉషా కిరణ్ మూవీస్ నిర్మించిన 'నువ్వే కావాలి' సినిమా నేషనల్ అవార్డ్ అందుకుంది. ఆయన ఖాతాలో 4 ఫిల్మ్‌ఫేర్, 5 నంది అవార్డులు కూడా ఉన్నాయి.

### మిలియన్ల డాలర్లు..

2021 నాటికి రామోజీ రావు ఆస్తుల విలువ రూ.37,583 కోట్లు ఉన్నట్లు అని సమాచారం. ఆస్తుల విషయం పక్కన పెడితే.. ఆయన నెలకొల్పిన సంస్థల ద్వారా ఎంతోమందికి ఉపాధి లభిస్తోంది. ఎన్నో జీవితాల్లో వెలుగులు నింపారు. అందుకే ఆయన ఎంతోమంది అభిమానులను సంపాదించుకున్నారు. ఆ తరం వాళ్లకు మాత్రమే కాకుండా ఈతరం ప్రేక్షకులకు కూడా నచ్చేలా ఎన్నో యూత్‌ఫుల్ సినిమాలను తెరకెక్కించింది ఉషా కిరణ్ మూవీస్. ఈ సంస్థ ద్వారా ఎంతోమంది దర్శకులుగా, యాక్టర్లుగా పరిచమయ్యి ప్రస్తుతం స్టార్ స్టేటస్‌ను సంపాదించుకున్నారు. ఇక ఇప్పటికీ ఈటీవీ అనేది పేరు కాదని అదొక బ్రాండ్ అని ఆయన అభిమానులు అంటుంటారు. వార్తా పత్రికలు చదివే రోజులు పోయాయి అని చాలామంది భావిస్తున్నా ఇప్పటికీ ఈనాడు పత్రికకు మంచి సర్క్యులేషన్ ఉంది. మీడియా, ఎంటర్‌టైన్మెంట్ మాత్రమే కాకుండా.. వివిధ వ్యాపారాల్లో కూడా సక్సెస్‌ఫుల్‌గా రాణిస్తున్నారు. ప్రియా పచ్చళ్ల నుంచి.. కళాంజలి, డాల్ఫిన్ హోటల్స్, మార్గదర్శి చిట్‌ఫండ్స్ వరకు.. ఇలా ఎన్నో విధాలుగా ఆయన తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించారు. నమ్మకానికి మారుపేరు అయ్యారు.

### రామోజీరావు ఒక వ్యక్తి కాదు, వ్యవస్థ

**- టీడీపీ అధినేత చంద్రబాబు**



సమాజహితం కోసమే అనునిత్యం కష్టపడ్డారు. తెలుగుజాతి కోసం అహర్నిశలు పనిచేశారు. రామోజీరావు ఒక వ్యక్తి కాదు, వ్యవస్థ అని. చిత్రపరిశ్రమకు ఎనలేని సేవలు చేశారు. ధర్మం ప్రకారం పనిచేస్తానని రామోజీరావు స్పష్టంగా చెప్పేవారు. రామోజీరావు నిర్మించిన వ్యవస్థలు శాశ్వతం. అత్యున్నత ప్రమాణాలతో రామోజీ ఫిలింసిటీ స్థాపించారు. రామోజీరావు తన జీవిత కాలంలో విశ్వసనీయత సంపాదించారు. తెలుగుజాతిని ముందుకు తీసుకెళ్లేందుకు కృషిచేశారు. ఏపీ భివృద్ధికి ఆయన ఇచ్చిన స్ఫూర్తితో ముందుకెళ్తాం. రామోజీరావు ఆత్మకు శాంతి కలగాలని దేవుడిని ప్రార్థిస్తున్నాను.

---

రామోజీరావు మరణ వార్త చాలా దిగ్భ్రాంతి కలిగించింది. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వేలాది మంది జర్నలిస్టులు ఈనాడు జర్నలిజం స్కూల్ నుంచి వచ్చిన వారే.రామోజీరావు మరణ వార్త చాలా దిగ్భ్రాంతి కలిగించింది. తెలుగు రాష్ట్రాల్లో ఉన్న వేలాది మంది జర్నలిస్టులు ఈనాడు జర్నలిజం స్కూల్ నుంచి వచ్చిన వారే.రామోజీ రావు తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ఎంతో చేశారు. అత్యున్నత ప్రమాణాలతో గొప్ప ఫిల్మ్‌సిటీని నిర్మించారు.



ఆయన కుటుంబ సభ్యులకు భగవంతుడు అండగా ఉండాలి. ఈనాడు గ్రూప్ సంస్థ వారికి నా తరపున, జనసేన తరపున సంతాపం తెలియజేస్తున్నాను

**- పవన్ కల్యాణ్, జనసేన అధినేత**

---

ఒక మనిషి అనేక రంగాల్లో వివిధ సంస్థలు స్థాపించి వాటిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లారు. ఎంతోమందికి మార్గదర్శకంగా నిలిచారు. మరెంతో మందికి ఉపాధి కల్పించారు. అలాంటి వ్యక్తికి భారతరత్న ఇవ్వడమే సముచితమని రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను



**- ప్రముఖ దర్శకుడు రాజమౌళి**

---


రామోజీ రావు తెలుగు పత్రికా రంగంతో పాటు తెలుగు ప్రసార మాధ్యమాల్లో ఒక విప్లవాత్మకమైన మార్పుకు రామోజీ రావు బీజం వేశారు. ఈనాడు పత్రిక స్థాపించిన తర్వాత, ఈటీవీ ద్వారా ఎల్రానిక్ మీడియా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారు. ప్రొఫెషనిలజంతో, విలువలతో కూడిన జర్నలిజానికి రామోజీ రావు గుర్తుగా నిలిచిపోతారు. తెలుగు భాషాభివృద్ధి కోసం ఆయన ఎంతో తపన పడ్డారు. తెలుగు ప్రజలు, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల గురించి గొప్పగా మాట్లాడేవారు. ఎన్నో సందర్భాల్లో ఇదే ఫిలిం సిటీలో వారిని కలుసుకునే అవకాశం తనకు లభించింది. మొబైల్ ఎన్‌సైక్లోపీడియా లాగా అన్ని విషయాలు చెప్పేవారు



**- మాజీ మంత్రి కేటీఆర్**

---

రామోజీరావు ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం, ప్రజల కోసం అలుపెరుగని యోధుడిలా పనిచేసిన పోరాట యోధుడని కొనియాడారు. నేడు ప్రజాస్వామ్య విజయాన్ని చూసి, ఆనందించి, స్వర్గస్తులయ్యారని అన్నారు. రామోజీ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ప్రజా జీవితంలో రామోజీ వ్యవస్థలు భాగస్వామ్యమయ్యాయని వెల్లడించారు. ఆయన మరణం విచారకరమని అన్నారు.



**- జస్టిస్ ఎన్ వి రమణ**

---

ఈనాడు గ్రూప్, ఈటీవీ నెట్‌వర్క్, ఫిల్మ్ సిటీ వ్యవస్థాపకులు రామోజీరావు మరణవార్త దిగ్భ్రాంతికి గురిచేసింది. కమ్యూనికేషన్ ప్రపంచానికి ప్రత్యేకంగా తెలుగు మీడియాకు ఆయన దార్శనికుడు. ఆయన గురించి నాకు బాగా తెలుసు. మంచి పరిచయం ఉంది. ఓసారి ఫిల్మ్‌సిటీకి నన్ను ఆహ్వానించారు. ఫిల్మ్‌సిటీ సందర్శన మధురానుభూతి నాకు ఇంకా గుర్తుంది. ఆ జ్ఞాపకాలను ఎప్పటికీ మర్చిపోలేను. ఆయన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను



**- పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ**

---

రామోజీ మరణంతో మీడియా, వినోద రంగం ఓ టైటాన్‌ను కోల్పోయింది. రామోజీరావు ఓ వినూత్న వ్యాపారవేత్త. ఈనాడు వార్తా పత్రిక, ఈటీవీ న్యూస్ నెట్‌వర్క్, రామోజీ ఫిల్మ్ సిటీ సహా అనేక సంస్థలను స్థాపించి ఎంతో మందికి ఉపాధి కల్పించారు. తన దూరదృష్టితో ఎన్నో విజయాలు సాధించి సమాజంలో చెరగని ముద్రవేశారు. మీడియా, సినీ పరిశ్రమలకు ఆయన అందించిన సేవలు చిరస్మరణీయం. పద్మవిభూషణ్ అందుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు నా ప్రగాఢ సానుభూతి



**- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**

---


ఈనాడు అధినేత రామోజీరావు మరణం పట్ల సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. తెలుగు జర్నలిజానికి విశ్వసనీయత, తెలుగు పారిశ్రామిక రంగానికి విలువలు జోడించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. తెలుగు పత్రికా, మీడియా రంగానికి రామోజీరావు లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనిదని చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

---

పాత్రికేయ, సినీరంగంపై రామోజీరావు చెరగని ముద్ర వేశారని ప్రధాని మోదీ కొనియాడారు. ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించిందని ట్వీట్ చేశారు. రామోజీరావుతో మాట్లాడే అవకాశం తనకు ఎన్నోసార్లు దక్కిందని తెలిపారు. "మీడియాలో రామోజీ సరికొత్త ప్రమాణాలు నెలకొల్పారు. రామోజీరావు ఎప్పుడూ దేశాభివృద్ధి కోసమే ఆలోచించేవారు. ఆయనతో మాట్లాడే అవకాశం నాకు ఎన్నోసార్లు దక్కింది. రామోజీరావు నుంచి ఎన్నో విషయాలు నేర్చుకున్నా. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి. రామోజీరావు అసంఖ్యాక అభిమానులకు నా సానుభూతి"



**- ప్రధాని నరేంద్ర మోడీ**

---

రామోజీరావు సంస్థ ద్వారా 'తొలి చూపులోనే' సినిమాతో నా సినీ ప్రస్థానం మొదలైంది. నాలాగే ఎంతో మంది సినీతారలకు అవకాశం ఇచ్చారు. టీవీలోనూ రచయితలు, నటులను పరిచయం చేశారు. ఈనాడు, ఈటీవీల ద్వారా నమ్మకమైన వార్తలను అందించిన వ్యక్తి రామోజీరావు. సినిమా ఇండస్ట్రీకి రామోజీ ఫిల్మ్ సిటీ గొప్ప ఆస్తి. ఆయన మరణం కలచివేస్తోంది. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం ప్రసాదించాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నాను.



**- నందమూరి కల్యాణ్ రామ్, సినీనటుడు**

---

రామోజీరావు మరణం చాలా బాధాకారం. తెలుగు చిత్ర పరిశ్రమకు ఆయనలోటు తీర్చలేనిది. రాబోయే తరాలకు రామోజీరా వు ఒక మార్గదర్శి. ఆయన జీవితాంతం విలువలను పాటిస్తూ, ఆదర్శంగా నిలిచారు



**- రాజేంద్రప్రసాద్ సినీనటుడు**

---

బతికితే ఒక్కరోజైనా రామోజీరావు గారిలా మనిషన్నవాడు బతకాలని అంటుంది నా భార్య' అంటూ రామోజీరావు గురించి సందర్భం వచ్చినప్పుడల్లా సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి అంటుంటారు. రామోజీరావు మరణవార్త వినగానే కుంగిపోయాయని చెప్పారు. రామోజీరావు పార్థివదేహానికి నివాళులు అర్పించారు. తన అభిమానాన్ని మనసులో దాచుకోలేక భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టుకున్నారు.



**- ఎంఎం కీరవాణి**

**మీడియా టైటాన్ రామోజీరావుకు రాజకీయ, సినిమా, పలు రంగాలకు చెందిన ప్రముఖులు నివాళులు అర్పించి తమ ప్రగాఢ సానభూతిని కుటుంబ సభ్యులకు తెలియజేశారు.**

# మంత్రుల పెట్టుబడుల వేట



**విశాలభారతి, స్టేట్ బ్యూరో :** తెలంగాణకు పెట్టుబడులను తీసుకొచ్చేందుకు మంత్రులు శ్రీధర్బాబు, కోమటిరెడ్డి వెంకట్రెడ్డి వేట మొదలు పెట్టారు. పెట్టుబడి దారులను ఆకర్షించే పనిలో పడ్డారు. ఇటీవల ఇద్దరు మంత్రులు అమెరికా వెళ్లిన విషయం తెలిసిందే. అట్లాంటాలోని కోకా-కోలా హెడ్ క్వార్టర్స్లో కంపెనీ అంతర్జాతీయ ప్రభుత్వ సంబంధాల విభాగ గ్రూప్ డైరెక్టర్ జోనథన్ రీఫ్తో వారు సమావేశమయ్యారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సింది గా కోకా-కోలా మేనేజ్ మెంట్ను మంత్రులిద్దారూ ఆహ్వానించా రు. దాదాపు గంటన్నర సేపు జరిగిన సమావేశంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన పరిస్థితులను విజువల్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేష్ రంజన్, పెట్టుబడుల శాఖ స్పెషల్ సెక్రెటరీ డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి ఈ మేరకు వారికి ప్రజెంటేషన్ ఇచ్చారు.

### తెలంగాణలో ఎక్కడైనా మాకు ఓకే...

తెలంగాణలోని ఏ జిల్లాలో ప్లాంట్ పెట్టినా తాము ప్రభుత్వం తరపున సహకారం అందిస్తామని మంత్రులు శ్రీధర్బాబు, వెంకటరెడ్డిలు కోకా%-%కోలా ప్రతినిధులకు హామీనిచ్చారు. భారతదేశంలో పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామంగా మారిందని, గత రెండు దశాబ్దాలుగా హైదరాబాద్లో అంతర్జాతీయ కంపెనీల పెట్టుబడులు గణనీయంగా పెరిగాయని మంత్రుల బృందం జోనథన్కు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానం పట్ల సానుకూలంగా స్పందించిన జోనథన్ హైదరాబాద్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు.

### డెల్టా ఎయిర్ లైన్స్‌తోనూ చర్చలు...

అట్లాంటాలో డెల్టా ఎయిర్‌లైన్స్ సీటీవో నారాయణన్ కృష్ణకుమార్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలున్నాయని, ప్రభుత్వం అన్ని రకాలుగా సౌకర్యాలూ కల్పిస్తుందని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ప్రజెంటేషన్‌పై సంతృప్తి వ్యక్తం చేసిన కృష్ణకుమార్, డెల్టా ఏవియేషన్ టీమ్.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేసింది. హైదరాబాద్ నుంచి అట్లాంటాకు నేరుగా విమానం నడపాలంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కోరారు. డెల్టా ఎయిర్‌లైన్స్ యాజమాన్యం సానుకూలంగా స్పందించినట్లు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయ.



### కీలకంగా మారిన జయేష్ రంజన్...

బీఆర్ఎస్ హయాంలో కీలకంగా పనిచేసిన సీనియర్ ఆఫీసర్ జయేష్ రంజన్.. కాంగ్రెస్ హయాంలోనూ అదే విధంగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి పెట్టుబడుల కోసం అధికార బృందం, మంత్రులు అమెరికాకు వెళ్లారు. కాగా, పెట్టుబడుల విషయంలో జయేష్ రంజన్ అన్నీ తానై నడిపిస్తుండటం విశేషం.

# నేడే గ్రూప్ 1



**మొదటిపేజీ తరువాయి :**
ఎబిలిటీ నుంచి మొత్తం 150 ప్రశ్నలు అడుగుతారు. ఆబ్జెక్టివ్ విధానంలో ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష సమయం రెండున్నర గంటలు (150 నిమిషాలు). ప్రిలిమ్స్ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులలో నిర్ణీత నిష్పత్తిలో మెయిన్ పరీక్షకు ఎంపికచేస్తారు.

ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: ఆసిఫాబాద్-కొమ్రంభీమ్, మంచిర్యాల, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, సిరిసిల్ల-రాజన్న, సిద్ధిపేట, మెదక్, కామారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, సూర్యాపేట, నల్గొండ, భువనగిరి-యాదాద్రి, జనగాం, మేడ్చల్-మల్కాజ్‌గిరి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ-గద్వాల్, వనపర్తి, నాగర్‌కర్నూల్.

### డిక్లరేషన్ తప్పనిసరి...

గ్రూప్-1 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌లో ఫోటో, వివరాలు సరిగా లేకుంటే, అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా విద్యార్థి గతంలో చదువుకున్న విద్యాసంస్థ ప్రిన్సిపల్ అటెస్ట్ చేసిన మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతోపాటు కమిషన్ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన ధ్రువీకరణ పత్రాన్ని పూర్తిచేసి ఇన్విజిలేటర్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. అలా అయితేనే పరీక్షకు అనుమతిస్తారు. అదేవిధంగా హాల్‌టికెట్‌ను ఏ4 సైజులో ప్రింట్ తీసుకోవాలి. దానిపై కేటాయించిన స్థలంలో తాజా పాస్‌పోర్టు ఫొటోను అతికించాల్సి ఉంటుంది. ఫొటో లేని హాల్‌టికెట్లను పరిగణనలోకి తీసుకోరు. వారిని అనుమతించరు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ డిక్లరేషన్/అథంటికేషన్ (ఫామ్-1, ఫామ్-2)లను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. వివరాలు తప్పుగా నమోదుచేసిన అభ్యర్థులు తప్పనిసరిగా డిక్లరేషన్ ఫామ్ సమర్పించాల్సి ఉంటుంది. ఫొటోను సరిగా అప్‌లోడ్ చేయలేకపోయిన అభ్యర్థులు లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోను డిక్లరేషన్ ఫామ్-1కు జతచేయాల్సి ఉంటుంది. అలాగే పేరు తప్పుగా ఉన్న అభ్యర్థులు తమ పదోతరగతి లేదా డిగ్రీ సర్టిఫికేట్‌లో ఉన్న విధంగా పూర్తి పేరును డిక్లరేషన్ ఫామ్-2లో నమోదుచేయాల్సి ఉంటుంది. అదేవిధంగా గెజిటెడ్ ఆఫీసర్ లేదా అభ్యర్థులు చివరిగా చదివిన విద్యాసంస్థ ప్రిన్సిపల్ ద్వారా అటెస్టేషన్ చేయించాల్సి ఉంటుంది.

- గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌పై గత మూడు నెలల్లో తీసుకున్న పాస్‌పోర్టు ఫొటో అతికించాలి. హాల్‌టికెట్‌తోపాటు ప్రభుత్వ గుర్తింపు పొందిన ఏదైనా ఒరిజినల్ ఫొటో గుర్తింపు కార్డును తీసుకెళ్లాల్సి ఉంటుంది.
- అభ్యర్థులు బయోమెట్రిక్ తప్పనిసరి ఇవ్వాలి. బయోమెట్రిక్ ఇవ్వని అభ్యర్థుల జవాబు పత్రాలను మూల్యాంకనంలో పరిగణనలోకి తీసుకోరు. హాల్‌టికెట్, ప్రశ్నపత్రంపై ముద్రించిన సూచనలు తప్పనిసరి పాటించాలని తెలిపింది.
- గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ మీద ఫొటో సరిగా లేకుంటే, అభ్యర్థి గెజిటెడ్ అధికారి లేదా విద్యార్థి గతంలో చదువుకున్న విద్యాసంస్థ ప్రిన్సిపల్ అటెస్ట్ చేసిన మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలతోపాటు కమిషన్ వెబ్‌సైట్లో పొందుపరిచిన ధ్రువీకరణ పత్రాన్ని పూర్తిచేసి ఇన్విజిలేటర్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. అలా అయితేనే పరీక్షకు అనుమతిస్తారు.
- అభ్యర్థులు పరీక్ష సమయానికి అరగంట ముందుగానే తమకు కేటాయించిన కేంద్రాలకు చేరుకోవాలి. ఉదయం 9 గంటల నుంచే పరీక్ష హాల్‌లోకి పంపిస్తారు. ఉదయం 10 గంటలకు గేట్లను మూసివేస్తారు. నిమిషం ఆలస్యమైనా లోపలికి అనుమితించరు. ఉదయం 9.30 గంటల నుంచే అభ్యర్థుల నుంచి బయోమెట్రిక్ వివరాలు సేకరిస్తారు.
- సరైన వివరాలు బబ్లింగ్ చేయని, పెన్సిల్, ఇంక్ పెన్, జెల్ పెన్ ఉపయోగించిన, డబుల్ బబ్లింగ్ చేసిన, వైట్నర్, చాక్ పౌడర్, బ్లేడు, ఎరేజర్‌తో బబ్లింగ్ చేసే పత్రాలు చెల్లుబాటు కావు.
- పరీక్ష కేంద్రంలోకి ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, డిజిటల్ వాచీలు, బ్లూటూత్ డివైజ్‌లు, కాలిక్యులేటర్లు, లాగ్ టేబుల్స్, రైటింగ్ పాడ్, నోట్స్, చార్టులు, ఆభరణాలు, హ్యాండ్ బ్యాగ్‌లు, పర్సులు అనుమతించరు.
- అభ్యర్థులు చెప్పులు మాత్రమే వేసుకొని పరీక్షకు హాజరుకావాలి. షూ వంటివి ధరించకూడదు.
- బ్లాక్ లేదా నీలం రంగు పెన్ను మాత్రమే ఉపయోగించాల్సి ఉంటుంది. జెల్, ఇంకు పెన్ను, పెన్సిళ్లను స్కానర్ గుర్తించదు.
- అభ్యర్థులు %వాీ=% పత్రంలో ఏమైనా తప్పులు చేస్తే, దానికి బదులుగా మరొకటి ఇవ్వరు. ఓఎంఆర్ పత్రంలో వ్యక్తిగత వివరాలు, సమాధానాలను బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో సక్రమంగా బబ్లింగ్ చేయాలి.
- ఎవరైనా అభ్యర్థులు అక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు చేసి, కమిషన్ నిర్వహించే పరీక్షలు రాయకుండా డిబార్ చేస్తారని అభ్యర్థులు గుర్తుంచుకోవాలి.

# ఇక నుంచి ఖరీదైన వైద్యం కూడా ఉచితమే

- తెలంగాణ ప్రజలకు సర్కార్ శుభవార్త
- ఆరోగ్య శ్రీ పథకం కింద ఖరీదైన వైద్య సేవలను అందించాలని నిర్ణయం
- రూ.497.29 కోట్లు విడుదల చేసిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**విశాలభారతి,స్టేట్ బ్యూరో :** తెలంగాణ సర్కార్ ప్రజలకు మరో శుభవార్త వినిపించింది. ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా ఇప్పటికే రకరకాల వ్యాధులకు ఆరోగ్య శ్రీ పథకం కింద చికిత్స అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే ప్రభుత్వం మరికొన్ని ఖరీదైన వైద్య సేవలను ఈ పథకం ద్వారా వర్తించేలా కీలక నిర్ణయం తీసుకుంది. గుండె సమస్యల నిర్ధారణకు నిర్వహించే యాంజియోగ్రామ్ పరీక్షలు కూడా ఇక నుంచి ఆరోగ్య శ్రీ కార్డు ద్వారా చేపించుకునేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో పాటు పార్కిన్ సన్, వెన్నుముక సమస్యల వంటి ఖరీదైన వ్యాధులను కూడా ఆరోగ్య శ్రీలో చేర్చుతూ సర్కార్ నిర్ణయం తీసుకుంది. కొత్తగా ఆరోగ్యశ్రీలో మరో 65 కొత్త చికిత్స విధానాలను అమలు చేయనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఆరోగ్య శ్రీలో ప్రస్తుతం ఉన్న 1672 చికిత్స విధానాల్లో 1375 ప్రోసీజర్లకు ప్యాకేజీ ధరలు పెంచింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం. ఇందుకు అదనంగా వీటికి సంబంధించి రూ.497.29 కోట్లు అవసరం కాగా, ఈ నిధులను రిలీజ్ చేసినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్య శ్రీ పథకం కింద 2.84 కోట్ల లబ్ధిదారులు ఉండగా, వీరికి ఈ పథకం ద్వారా రూ.10 లక్షల మేర వైద్య సాయం అందనుంది. తెలంగాణ వ్యాప్తంగా 1402 ఆసుపత్రుల్లో ఈ రాజీవ్ ఆరోగ్య శ్రీ సేవలు అందుతున్నాయి. 2007లో కాంగ్రెస్ తీసుకొచ్చిన పథకం ఆరోగ్యశ్రీ... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకం ప్రెవేశపెట్టడం తెలిసిందే. ఈ పథకం కింద 2.84 కోట్ల మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరికి 10 లక్షల వరకు ఆర్థికసాయం ఈ పథకం ద్వారా అందుతోంది. రాష్ట్రంలో 1402 ఆసుపత్రుల ద్వారా ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ పరిధిలో 1672 చికిత్సా విధానాలు అందుబాటులో వున్నాయి. ఇందులో 1375 విధానాలకు ప్యాకేజీ ధరలు పెంచాలని వైద్య నిపుణుల సూచనల మేరకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ నిర్ణయం తీసుకున్నారు.

## విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి

**శాలిగౌరారం ,విశాలభారతి :** నేల మీద తెగిపడిన విద్యుత్ తీగలు రెండు గేదెలకు యమాపాశలాయ్యాయి. మేత మేస్తున్న రెండు గేదెలు విద్యుత్ షాక్ తో అక్కడికిక్కడే మృతి చెందాయి. శాలిగౌరారం మార్కెట్ కాలనీ కీ చెందిన బొడ్డు నాగరాజు రెండు గేదెలు గ్రామ శివారులో మేతకు వెళ్లాయి. ఇటీవల వేచిన భారీ ఈదురు గాలులకు విద్యుత్తు తీగలు తెగిపడ్డాయి. తెగి పడిన తీగల వద్ద గేదెలు గడ్డి మేస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అవి అక్కడిక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ దాదావు 50 వేల వరకు ఉంటుందని భాదితుడు నాగరాజు తెలిపారు. విద్యత్తు అధికారుల నిర్లక్ష్యం వల్లే తన రెండు గేదెలు మృతి చెందాయని అధికారులు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు.

## నీట్ యూజీ ఫలితాలపై ప్రత్యేక కమిటీ

- ఆ 1500 విద్యార్థుల మార్కులపై సమీక్ష

**విశాలభారతి,నేషనల్ బ్యూరో :** వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పరీక్షలో 67 మందికి ప్రథమ ర్యాంకు రావడంపై నిరసనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పరీక్షలో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు వెల్లువెత్తడం వల్ల యూపీఎస్సీ మాజీ ఛైర్మన్ సారథ్యంలో నలుగురు సభ్యులతో కమిటీ వేయాలని నిర్ణయించుకున్నట్లు ఎన్టీఏ డీజీ సుబోధ్కుమార్ సింగ్ తెలిపారు. ఈ కమిటీ వారం రోజుల్లో నివేదిక ఇస్తుందని పేర్కొన్నారు. 1500 మందికి పైగా అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కుల్ని కమిటీ సమీక్షిస్తుందని, నివేదిక తర్వాతే వారి ఫలితాలను సవరించే అవకాశం ఉంటుందన్నారు. గ్రేస్ మార్కులు ఇవ్వడం వల్ల పరీక్ష అర్హతా ప్రమాణాలపై ఎలాంటి ప్రభావం ఉండదన్న సుబోధ్ కుమార్ సింగ్ ఉన్నారు. ఆ అభ్యర్థుల ఫలితాల్ని సమీక్షించడం ద్వారా అడ్మిషన్ ప్రక్రియపైనా ఎలాంటి ప్రభావమూ ఉండదని పేర్కొన్నారు. నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణల్ని సుబోధ్ కుమార్ ఖండించారు. పేపర్ లీక్ కాలేదని, అవకతవకలేమీ జరగలేదన్నారు. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ పరీక్ష సమగ్రతకు ఎలాంటి భంగం వాటిల్లలేదని స్పష్టంచేశారు. అయితే ఎన్సీఈఆర్టీ పాఠ్యపుస్తకాల్లో మార్పులు, పరీక్ష కేంద్రాల వద్ద సమయం కోల్పోవడం వల్ల ఇచ్చిన గ్రేస్ మార్కుల ద్వారా ఆ విద్యార్థులు అధిక మార్కులు సాధించడానికి కారణాలని వివరించారు. అయితే, ఆ విద్యార్థులకు మళ్లీ పరీక్ష నిర్వహిస్తారా? లేదా అనే ప్రశ్నకు ఆయన స్పందిస్తూ ఈ అంశంపై నిర్ణయం కమిటీ ఇచ్చిన సిఫారసులపై ఆధారపడి ఉంటుందన్నారు.

## నేడు మోదీ పట్టాభిషేకం

- మూడోసారి ప్రధానిగా ప్రమాణం చేయనున్న మోడీ
- జవహర్‌లాల్ నెహ్రూ రికార్డు సమం చేయనున్నారు
- హాజరుకానున్న వివిధ దేశాధినేతలు



**విశాల భారతి, స్టేట్ బ్యూరో :** ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ పట్టాభిషేకం ఆదివారం జరగనుంది. ఆదివారం రాత్రి 7:15 నిమిషాలకు రాష్ట్రపతి భవన్‌లో జరిగే కార్యక్రమంలో నరేంద్ర మోదీ ప్రధానిగా మూడోసారి ప్రమాణం చేయనున్నారు. తద్వారా దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ రికార్డు సమం చేయనున్నారు. దీనికి సంబంధించి అట్టహాసంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ప్రముఖులతో పాటు వివిధ దేశాల నేతలు కూడా హాజరుకానున్నారు. మరోవైపు మోదీ 3.0 కేబినెట్పై ఆసక్తి నెలకొంది. ఎన్డీఏ కూటమిలోని మిత్రపక్షాలకు 5 నుంచి 8 కేబినెట్ బెర్తులు దక్కే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు బీజేపీ కీలక నేతలు అమిత్ షా, జేపీ నడ్డా, రాజ్‌నాథ్ సింగ్ మిత్రపక్షాల నేతలు చంద్రబాబు, నీతీశ్ కుమార్, ఏక్‌నాథ్ శిందేతో సంప్రదింపులు జరిపారు. కీలకమైన హెూంశాఖ, ఆర్థిక శాఖ, రక్షణశాఖ, విదేశాంగ శాఖతో పాటు విద్య, సాంస్కృతిక మంత్రిత్వ శాఖలు తమ వద్దనే ఉండనున్నట్లు బీజేపీ సంకేతాలు ఇచ్చింది. అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ మరోసారి కేంద్ర మంత్రివర్గంలో చోటు దక్కించుకోవడం ఖాయంగా తెలుస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన మాజీ సీఎంలు శివరాజ్‌సింగ్ చౌహాన్, బసవరాజ్ బొమ్మై, మనోహర్‌లాల్ ఖట్టర్, సర్బానంద సోనోవాల్ మంత్రిపదవులు దక్కించుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. తెలుగుదేశం ఎంపీ రామ్మోహన్ నాయుడు, జేడీయూ నుంచి లలన్ సింగ్ లేదా సంజయ్ ఝా, రామ్‌నాథ్ ఠాకూర్, లోక్‌జనశక్తి రాం విలాస్ పాసవాన్ పార్టీకి చెందిన చిరాగ్ పాసవాన్ మంత్రివర్గంలో చోటు దక్కించుకోనున్నట్లు తెలుస్తోంది.

### హాజరుకానున్న వివిధ దేశాధినేతలు

ఇక మోదీ ప్రమాణ స్వీకారోత్సవానికి శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమ్‌సింఘే, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్, భూటాన్ ప్రధాని తోబ్గే తదితర విదేశీ ప్రముఖులు హాజరుకానున్నారు. ఇప్పటికే బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, సీషెల్స్ ఉపాధ్యక్షుడు అహ్మద్ అఫీఫ్ దిల్లీ చేరుకున్నారు. ఇది ఇలా ఉండగా మోదీ ప్రమాణ స్వీకారానికి కాంగ్రెస్ నేతలకు ఇంకా ఆహ్వానం అందలేని పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ తేలిపారు.

## నితీశ్‌కు...ప్రధాని అవకాశం

**మొదటిపేజీ తరువాయి :** వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీనిపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. త్యాగి చేసిన వ్యాఖ్యలను ఖండించింది. "నీతీశ్‌ను ప్రధానిగా చేసేందుకు ఇండియా కూటమి సంప్రదించడంపై కాంగ్రెస్‌కు ఎలాంటి సమాచారం లేదు. ఈ విషయం గురించి కేవలం ఆయనకు మాత్రమే తెలుసు" అని హస్తం పార్టీ నేత కేసీ వేణుగోపాల్ కౌంటర్ ఇచ్చారు

## నిత్యావసర సరుకులు వితరణ



**రాజంపేట, విశాలభారతి:** వరదాయపల్లెలో నివసిస్తున్న పందేపాటి నరసింహులు గత కొన్ని సంవత్సరల నుండి కాలు లేక నడవలేని పరిస్థితుల్లో ఉన్నాడు. అతని కుటుంబం చాలా పేదరికంలో ఉన్న నరసింహులు వయస్సు 45 సంవత్సరాలు వారికి ఇంట్లో గడవటం చాలా కష్టంగా ఉందని నరసింహులు పసుపులేటి సరస్వతమ్మ మెమోరియల్ ఫౌండేషన్ ట్రస్టు మెంబర్ పసుపులేటి వినోద్ కుమార్ ని సంప్రదించారు. ఆ విషయాన్ని ఆ ట్రస్టు చైర్మన్ పసుపులేటి పవన్ కుమార్ తెలియగా పసుపులేటి పవన్ కుమార్ పసుపులేటి నాగేంద్ర ఇరువురి సహకారంతో వారికి నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలి అని పసుపులేటి వినోద్ కుమార్ కి తెలియజేశారు. వినోద్ కుమార్ శనివారం నరసింహులుకి నిత్యవసర సరుకులు అందజేశారు.

# భవిష్యత్తులో ఇండియా కుటమిదే అధికారం

- సీఎం మమతా బెనర్జీ



**విశాలభారతి,నేషనల్ బ్యూరో :** ఇప్పుడు కాకపోయినా భవిష్యత్తులో ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పడుతుందని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ అన్నారు. ప్రజలు మార్పు కోరుకున్నప్పటికీ బీజేపీ అప్రజాస్వామికంగా, అక్రమంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి విమర్శించారు. కొత్తగా ఎన్నికైన టీఎంసీ ఎంపీలు, పార్టీ సీనియర్ నేతలతో మమతా బెనర్జీ శనివారం సమావేశమయ్యారు. లోక్‌సభలో పార్టీ అనుసరించే వ్యూహంపై చర్చించారు. ఈ సందర్భంగా నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్డీయే) ప్రభుత్వం మనుగడపై సందేహాన్ని ఆమె వ్యక్తం చేశారు. ఏం జరుగుతుందో అన్నది తమ పార్టీ ఎదురు చూస్తుందని, వేచి ఉంటుందని అన్నారు.కాగా, దేశానికి మార్పు అవసరమని, దేశం మార్పు కోరుకుంటోందని మమతా బెనర్జీ తెలిపారు. లోక్‌సభ ఎన్నికల తీర్పు ఈ మార్పు కోసమే అని అన్నారు. 'మేం వేచి ఉన్నాం. పరిస్థితిని గమనిస్తున్నాం. ఎన్నికల తీర్పు మోదీకి వ్యతిరేకంగా ఉంది. కాబట్టి ఆయన ఈసారి ప్రధాని కాకూడదు. వేరొకరు ప్రధాని పదవి చేపట్టేందుకు అనుమతించాలి' అని మీడియాతో అన్నారు. మరోవైపు బీజేపీ అప్రజాస్వామికంగా, చట్టవిరుద్ధంగా కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందని మమతా బెనర్జీ విమర్శించారు. అందుకే కొత్త ప్రభుత్వం ప్రమాణ స్వీకారోత్సవానికి తమ పార్టీ హాజరుకాదని తెలిపారు. 'ఈ రోజు ఇండియా బ్లాక్ ప్రభుత్వం ఏర్పడకపోవచ్చు. కానీ రేపు అది సాధ్యం కావచ్చు. మరికొంత కాలం వేచి ఉందాం' అని అన్నారు. కేంద్రంలో ఏర్పడే అస్థిర, బలహీన ప్రభుత్వం అధికారం కోల్పోతే తాను సంతోషిస్తానని వ్యాఖ్యానించారు


మీ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా ఫొటోలతో సహా సమస్యకు సంబంధించిన సమాచారాన్ని ...
ఈ క్రింది వాట్సాప్ నంబర్ కు షేర్ చేయగలరు...
9912162531

# ఈస్ట్ సిటీ వైపు.... రియల్ చూపు!

- ఈస్ట్ ప్రాంతాన్ని రియల్ డెస్టినీగా మార్చేలా ప్రణాళికలు
- సమృద్ధిగా భూములు, మెరుగైన ఇన్ ఫ్రా అభివృద్ధికి ఆస్కారం
- అందుబాటు ధరలతో సామాన్యుడి సొంతింటి కల సాకారం
- ఈస్ట్ సిటీలో పెరుగుతున్న రియల్ కార్యాకలాపాలపై రియల్ టాక్ కథనం

**గ్రేటర్ హైదరాబాద్ నగరం నలువైపులా విస్తరిస్తుంది. గడచిన రెండు దశాబ్దాలుగా వెస్ట్ జోన్‌లో అనూహ్య రీతిలో అభివృద్ధి చెందిన రియల్ ఎస్టేట్ ఇప్పుడు ఈస్ట్‌జోన్ వైపు చూస్తోంది. 'లుక్ ఈస్ట్' పేరుతో ప్రభుత్వం చూపుతున్న చొరవ రియల్ సంస్థలు దృష్టి సారించాయి. ఇప్పటికే పెరిగిన రోడ్ కనెక్టివిటీకి తోడు ఎయిర్ పోర్టు మెట్రో అలైన్‌మెంట్ ఎల్బీ నగర్ కేంద్రంగా విస్తరించడం ఈస్ట్ సిటీకి అత్యంత అనుకూలంగా మారాయి. ఈ కారణంగా స్థిరాస్తి పెట్టుబడులకు గ్రేటర్ ఈస్ట్ జోన్ మంచి సెంటర్ అవుతోందంటున్నారు. ప్రస్తుతం నగరంలో పెరిగిన ఇండ్ల ధరలతో సామాన్యుడి కలలు మరింత ప్రియంగా మారుతున్నాయి. లుక్ ఈస్ట్ విధానంతో సామాన్యుడికి అందుబాటులో ఉండే ధరలు సొంతింటి కల సాకారమయ్యే ఆస్కారం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.**



విశాలభారతి, హైదరాబాద్ :

రాష్ట్రంలో ఎన్నికల పర్వం ముగిసింది. అసెంబ్లీ ఎన్నికలతో మొదలై హైదరాబాద్ కేంద్రంగా గత ఆరేడు నెలలుగా రియల్ వ్యాపారం మందగమనంలో కొనసాగుతోంది. కొత్త ప్రాజెక్టులు మార్కెట్లోకి వస్తున్నా... ఆశించిన స్థాయిలో క్రయవిక్రయాలు జరగలేదు. ఇక కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం కూడా రియల్ ఎస్టేట్ రంగానికి ఊతమిచ్చేలా అభివృద్ధి ప్రణాళికలను అమలు చేయలేకపోయింది. పూర్తి స్థాయిలో నగరంలో మౌలిక వసతుల ప్రాజెక్టులపై దృష్టి సారించలేదు. ఎన్నికల హడావుడి ముగిసి, పాలన వైపు ప్రభుత్వ యంత్రాంగం అడుగులు వేయడంతో... ఇప్పుడు అందరీ దృష్టి రియల్ వ్యాపారం వైపు పడుతోంది. ముఖ్యంగా రాష్ట్రంలో ఆర్థిక వనరులను రేవంత్ సర్కార్ వెదుకుతోంది. ఈ క్రమంలో తెలంగాణ కేంద్రంగా రియల్ ఎస్టేట్ రంగం ప్రధాన ఆదాయ మార్గంగా మారడంతో... మార్కెట్‌ను సానుకూలంగా మార్చి, ఆదాయం పెంచుకోనుంది. అందుకే విదేశీ తరహాలో అభివృద్ధి చెందిన వెస్ట్ సిటీ నుంచి అందరి దృష్టిని ఆకర్షించేలా నగరం నలు వైపులా మళ్లించేలా ప్రణాళికలను అమలు చేస్తామని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. అందుకు అనుగుణంగా నగం చుట్టూరా పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేసి కమర్షియల్, రెసిడెన్షియల్ కాలనీలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే సమృద్ధిగా భూములు, అందుబాటులో భూముల ధరలు, పుష్కళమైన మౌలిక వసతుల అభివృద్ధికి ఆస్కారం ఉన్న ఈస్ట్ సిటీ వైపు దృష్టి మళ్లుతోంది.

గ్రేటర్ హైదరాబాద్ నగరం నలువైపులా విస్తరిస్తుంది. గడచిన రెండు దశాబ్దాలుగా వెస్ట్ జోన్‌లో అనూహ్య రీతిలో అభివృద్ధి చెందిన రియల్ ఎస్టేట్ ఇప్పుడు ఈస్ట్‌జోన్ వైపు చూస్తోంది. 'లుక్ ఈస్ట్' పేరుతో ప్రభుత్వం చూపుతున్న చొరవ రియల్ సంస్థలు దృష్టి సారించాయి. ఇప్పటికే పెరిగిన రోడ్ కనెక్టివిటీకి తోడు ఎయిర్ పోర్టు మెట్రో అలైన్‌మెంట్ ఎల్బీ నగర్ కేంద్రంగా విస్తరించడం ఈస్ట్ సిటీకి అత్యంత అనుకూలంగా మారాయి. ఈ కారణంగా స్థిరాస్తి పెట్టుబడులకు గ్రేటర్ ఈస్ట్ జోన్ మంచి సెంటర్ అవుతోందంటున్నారు. ప్రస్తుతం నగరంలో పెరిగిన ఇండ్ల ధరలతో సామాన్యుడి కలలు మరింత ప్రియంగా మారుతున్నాయి. లుక్ ఈస్ట్ విధానంతో సామాన్యుడికి అందుబాటులో ఉండే ధరలు సొంతింటి కల సాకారమయ్యే ఆస్కారం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

## రియల్ డెస్టనీ...

ఇక ఈస్ట్ జోన్‌లో ఇప్పటికే నాగోల్, ఎల్‌బీ నగర్ వరకు మెట్రో రైల్ సౌకర్యం ఉంది. ఉప్పల్ సమీపంలో భగాయత్ లే అవుట్, మెట్రో డిపో వద్ద వాణిజ్య సముదాయాలకు ఇంకా చాలా అవకాశాలు ఉన్నాయి. అంతేకాకుండా ఎస్ఆర్డీపీలో భాగంగా అనేక జంక్షన్లు ట్రాఫిక్ ఫ్రీ అయ్యాయి. మెట్రో విస్తరణ ఇప్పుడు ఈస్ట్ సిటీలో రియల్ ఎస్టేట్ రంగానికి బూస్టప్‌గా మారనుంది. హైదరాబాద్ తూర్పు భాగంలో ఐటీ కంపెనీలు, పరిశ్రమలను తీసుకువచ్చేలా ప్రభుత్వం 'లుక్ ఈస్ట్' విధానాన్ని అమలు చేయనుంది. వరంగల్ హైవే వైపు ఇండస్ట్రియల్ కారిడార్ పరిశీలనలో ఉన్నాయి. ఉప్పల్, ఎల్బీనగర్, నాగోల్, హయత్‌నగర్, పోచారం, ఘట్‌కేసర్, ఆదిభట్ల వంటి ప్రాంతాలు రియల్ ఎస్టేట్ మరింత అబివృద్ధి చెందే అవకాశం ఉంది. హెచ్ఎండిఏ డెవలప్ చేసిన ఉప్పల్ భగాయత్‌లో జరుగుతున్న రియల్ డెవలప్‌మెంట్ ఈస్ట్ జోన్‌లో స్థిరాస్తి రంగానికి క్రమంగా డిమాండ్ పెంచుతూనే ఉంది. ఈ ప్రాంతాల్లో వాణిజ్యపరమైన ఆస్తులను కొనుగోలు చేసేవారి సంఖ్య కూడా పెరుగుతుంది. ఇక వెస్ట్ జోన్‌తో పోల్చితే భూముల ధరలు కూడా తక్కువగా ఉండటంతో ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ రంగం మరింత పుంజుకునే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు. ముఖ్యంగా వరంగల్, విజయవాడ హైవే కారిడార్లు రియల్ ఎస్టేట్ రంగాన్ని క్రమంగా ప్రభావితం చేస్తున్నాయి. అదే విధంగా వెస్ట్ సిటీలోని మాదాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మణికొండ, కోకాపేట్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్, వంటి ప్రాంతాలు రియల్ ఎస్టేట్ రంగం భారీగా పెరిగింది. అనేక నివాస, వాణిజ్య సముదాయాలు, ఐటీ సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. ఆయా ప్రాంతాల్లో ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉన్న భూముల ధరలు కూడా అమాంతం పెరిగాయి. ఇక తగ్గిన భూముల లభ్యత, ఇబ్బడిముబ్బడిగా పెరిగిన రెసిడెన్షియల్ ప్రాజెక్టులతో ఐటీ కారిడార్ మొత్తం నిండిపోయింది. ఈ క్రమంలో కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఈస్ట్ సిటీపై దృష్టి సారించింది. దీంతోపాటు ఈస్ట్ సిటీలోని అన్ని ప్రాంతాల్లో ప్రాంతాల్లో భారీగా ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు అవసరమైన భూముల లభ్యత, అందుబాటులో విస్తారమైన స్థలం, విస్తరించిన ఉప్పల్, పోచారం, ఆదిభట్ల వంటి ప్రాంతాల్లో విస్తరించిన ఐటీ పరిశ్రమలతో కొత్త పెట్టుబడులను మరింత త్వరగా ఆకర్షించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

## విస్తరిస్తున్న హైరైజ్ కల్చర్...

హైరైజ్ భవనాలంటే కేవలం వెస్ట్ సిటీయే అనుకూలం అన్నట్లుగా మారింది. కానీ పెరిగిన ఆర్థిక ప్రమాణాలతో మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి వర్గాలు కూడా కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఈక్రమంలో సామాన్యుడు కొనుగోలు ఆలోచనలు అన్ని కూడా స్టాండ్ ఏలోన్, ఆఫర్డ బుల్ రేంజ్‌లో దొరికే ప్రాజెక్టుల వైపు ఉంటుంది. ఇక ధరల విషయంలో వెస్ట్ సిటీతో పోల్చితే ఈస్ట్ ప్రాంతంలో పుష్కళమై న ల్యాండ్ బ్యాంక్, ధరల్లో భారీ వ్యత్యాసం ఉంది. అదే సమయంలో వెస్ట్ సిటీ తరహాలో అభివృద్ధి చెందుతున్న ఈస్ట్ ప్రాంతాల్లోనూ హైరైజ్ కల్చర్ శరవేగంతో విస్తరిస్తోంది. ఇక భూముల ధరలు కూడా వెస్ట్‌తో పోల్చితే తక్కువగానే ఉండటం తో... తక్కువ ధరలోనే హైరైజ్ ప్రాజెక్టులను కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఇవే అంశాలు ఈస్ట్ సిటీలోనూ హైరైజ్ నిర్మాణాలను పెంచేందుకు కారణం అవుతు న్నాయి. ఉప్పల్ నుంచి ఎల్బీ నగర్ వరకు సుమారు పది కిలోమీటర్ల పరిధిలో ఊహించని స్థాయిలో హైరైజ్ కల్చర్ విస్తరిస్తోంది.

## ఈస్ట్‌లోనూ బడా ప్రాజెక్టులు

విజయవాడ హైవేకు సమీపంలో ఉండే దిల్‌సుఖ్ నగర్, ఎల్బీనగర్, హయత్‌నగర్‌తోపాటు వరంగల్ హైవే వెంబడి ఉన్న నాగోల్ ఉప్పల్, బోడుప్పల్, ఫిర్జాదిగూడ నుంచి ఘట్‌కేసర్ వరకు హైరైజ్, లగ్జరీ అపార్ట్‌మెంట్లను ప్రముఖ నిర్మాణ సంస్థలు చేపడుతన్నాయి. ఈ ప్రాంతాల్లో ఉన్న నివాస సముదాయాలన్నీ కూడా స్టాండ్ ఏలోన్ లేదా ఇండిపెండెంట్ ఇండ్లు ఎక్కువగా కనిపిస్తాయి. కానీ సకల సదుపాయాలతో లగ్జరీ అనుభూతినిచ్చే హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులను తొలిసారిగా వాసవి గ్రూప్ చేపట్టింది. వెస్ట్ సిటీలో మాత్రమే కనిపించే హైరైజ్ ప్రాజెక్టును సాధారణ, ఎగువ మధ్య తరగతి వర్గాలకు అనుకూలంగా ప్రాజెక్టులను వాసవి గ్రూప్ చేపట్టింది. అందుబాటు ధరలతోపాటు లగ్జరీ సదుపాయాలు ఉండే హై ఎండ్ ప్రాజెక్టులను నిర్మిస్తోంది. ఎల్బీనగర్ సరూర్ నగర్ స్టేడియాన్ని ఆనుకుని 33 అంతస్తుల్లో 11 హైరైజ్ భవనాలతో చేపట్టిన వాసవి ఆనంద నిలయం ప్రాజెక్టు ఈస్ట్ సిటీకి తలమానికంగా మారనుంది. ఈ ప్రాంతంలో తొలి హైరైజ్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టు కూడా ఇదే. 3576 ఫ్లాట్లలో స్కై విల్లాలను నిర్మిస్తున్నారు. పనులు శరవేగంగా సాగుతుండగా... 30 ఎకరాల విస్తీర్ణంలో 70శాతానికి పైగా ఓపెన్ స్పేస్‌తో ఈ ప్రాజెక్టు రానుంది. ఇప్పటికే ఉప్పల్ జంక్షన్, హబ్సిగూడ ప్రాంతాలు ఐటీ, ఐటీ ఆధారిత కంపెనీలు విస్తరించి ఉండటంతో... ఉప్పల్ ప్రధాన కేంద్రంగా వాసవి క్రౌన్ ఈస్ట్ హైరైజ్ ప్రాజెక్టును చేపట్టింది. 1.92 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక జీవనశైలిని కోరుకునే వారికి వీలుగా ఉండేలా 324 ఫ్లాట్లతో ఈ ప్రాజెక్టు కూడా అందుబాటులోకి తీసుకువస్తోంది. అదేవిధంగా ఫిర్జాదిగూడలో హరిహర శ్రీసాయి వీరాధ్య బ్రాండ్ నేమ్‌తో 10ఫ్లోర్లలలో, 214 యూనిట్ల ప్రాజెక్టును నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టు త్వరలో వినియోగదారులకు అందజేయనున్నారు. పోచారం క్రాస్ రోడ్డులో వరంగల్ హైవేకు ఆనుకుని హరిహర శ్రీసాయి కాకతీయ పేరుతో 360యూనిట్లతో 15 ఫ్లోర్లతో చేపట్టింది. మరో రెండేళ్లలో ఈ ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. ఇక సిటీలోనూ హైరైజ్ ట్రెండ్ విపరీతంగా పెరగడంతో... 40 ఫ్లోర్లతో తొలి స్కై స్క్రాపర్ ప్రాజెక్టు టీఎన్‌ఆర్ గ్రూప్ ఎల్బీనగర్ కేంద్రంగా చేపట్టింది. పూర్తి స్థాయిలో హైరైజ్ ప్రీమియం ఫ్లాట్లతో ప్రాజెక్టును అందుబాటులోకి తీసుకువస్తోంది. ఉప్పల్ భగాయత్‌లో నిర్మాణంలో నాణ్యత, ఆధునిక జీవన విధానానికి అనుకూలమైన వసతులతో టెర్రాస్ బేస్డ్ అమెనిటీస్‌తో 10 ఫ్లోర్లతో 100 ప్రీమియం ఫ్లాట్ల మోడ్రన్ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టును టీఎన్‌ఆర్ పూల్‌దీప్ ప్రాజెక్టును ఈ గ్రూప్ చేపట్టింది. ఇక ఉప్పల్ కేంద్రంగా ఐటీ, ఐటీ ఆధారిత సేవలు విస్తరిస్తున్నాయని చెప్పడానికి నిదర్శనమే జెన్ పాక్ట్ ప్రాంగణంలో రానున్న హైరైజ్ ఆఫీస్ స్పేస్. తొలిసారిగా ఈస్ట్ సిటీలో రాంకీ నిర్మాణ సంస్థ నుంచి ఈ ప్రాజెక్టును చేపట్టింది. 15 అంతస్తుల్లో1.9 మిలియన్ చదరపు అడుగుల విస్తీర్ణంలో భారీ హైరైజ్ ప్రాజెక్టును నిర్మిస్తోంది. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉండగా మరో రెండేళ్లలో 15వేల మంది ఒకచోట పనిచేసేంత వర్కింగ్ స్పేస్ అందుబాటులోకి రానుంది.



### సొమ్ము చేసుకుంటున్న కొన్ని సంస్థలు

ఈస్ట్ సిటీకి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కొన్ని రియల్ ఎస్టేట్ సంస్థలు భారీ ప్రాజెక్టుల పేరిట సొమ్ము చేసుకుంటున్నాయి. ముఖ్యంగా వెస్ట్ సిటీలో ఉన్న ధరలతో పోల్చితే ఈ ప్రాంతంలో కొంత తక్కువే ఉండటంతో... ఎకరం, రెండెకరాల విస్తీర్ణంలో ఉండే భూముల్లో హైరైజ్ ప్రాజెక్టుల పేరిట వ్యాపారం మొదలుపెట్టాయి. కానీ నిర్మాణంలో ఎలాంటి పురోగతి లేకపోవడంతో కొనుగోలుదారులు వెనుదిరిగి పోతున్నారు. చింతల్‌కుంట సమీపంలో ఓ నిర్మాణ సంస్థ హైరైజ్ ప్రాజెక్టు చేపట్టినా... ఆశించినంతగా గుర్తింపును పొందలేక పోయింది. కేవలం ప్రాజెక్టును ప్రకటించి, డెవలప్ మెంట్ యాక్టివిటీ లేకపోవడంతోనే ఆ ప్రాజెక్టులో క్రయవిక్రయాలు మందగించడానికి కారణాలు చెబుతున్నారు. కనీసం ఫౌండేషన్ పనులు కూడా పూర్తి కాకపోవడంతోనే ఈ ప్రాజెక్టుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

# గ్రూప్–1 పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

▶▶ జిల్లా వ్యాప్తంగా 47 సెంటర్లలో పరీక్ష రాయనున్న 16899 మంది అభ్యర్థులు

▶▶ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

**నల్లగొండ, విశాలభారతి:** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టి.జి.పి.యస్.సి.) నిర్వహిస్తున్న గ్రూప్ -I ప్రిలిమినరీ పరీక్షకు అన్నిరకాల భద్రత పరమైన ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పి చందనా దీప్తి ఐపిఎస్ ఒక ప్రకటనలో తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా 47 సెంటర్లలో మొత్తం 16899 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, పరీక్షకు వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుదని, పరీక్ష కేంద్రం పరిసర ప్రాంతాలలో సభలు, ఊరేగింపులు, ర్యాలీలు లాంటివి నిర్వహించ కూడదని, అనవసరంగా గుంపులు గుం పులుగా ఎవ్వరూ కూడా పరీక్ష కేంద్రం పరిసరాలలో తిరగటానికి అనుమతి లేదన్నారు. పరీక్షా కేంద్రం పరిసర ప్రాం తాల్లో ఎలాంటి జిరాక్స్ షాపులు తెరిచి ఉంచరాదని షాపు యజమానులకు సూచించారు. బయోమెట్రిక్ విధానం ద్వారా అటెండెన్స్ తీసుకోవడం జరుగుతుందని, అభ్యర్థులు బయో మెట్రిక్, వెరిఫికేషన్ సిబ్బందికి సహకరించాలని సూచించారు.



# మినీ గురుకులంలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



**పినపాక, విశాలభారతి:** తెలంగాణ గిరిజన సంక్షేమ మినీ గురుకులం బాలికల విద్యాలయం ఐలాపురం పినపాక మండలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2024-25 సంవత్సరమునకు గాను ఒకటో తరగతిలో ప్రవేశాలకు మరియు రెండవ తరగతి నుంచి 5వ తరగతిలో మిగిలిన బ్యాక్లాగ్ సీట్ల ప్రవేశమునకు అర్హత కలిగిన స్థానిక గిరిజన విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు లైజన్ ప్రిన్సిపాల్ పద్మావతి, ఇంచార్జ్ హెచ్ఎం లక్ష్మీదేవిలు తెలియజేశారు పినపాక మండలం స్థానికత కలిగిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడునని స్థానిక విద్యార్థులు లేనియెడల సమీప మండలాల విద్యార్థుల ప్రవేశమునకు రెండో ప్రాధాన్యత ఇవ్వబడుతుందని కావున అర్హత కలిగిన విద్యార్థులు వారి యొక్క దరఖాస్తులు మినీ గురుకులం పినపాక నందు 11-6-2024 నుండి 18-6 -2024 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని దరఖాస్తు చేయడానికి అభ్యర్థి రెండు పాస్ ఫోటోలు,అభ్యర్థి సంతకం, ఆధార్ కార్డ్, పుట్టిన తేదీ మరియు మొబైల్ నెంబర్ పొందుపరచగలరు దీనికి సంబంధించిన ఎంపిక ప్రక్రియ లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేస్తామన్నారు. ఈ పాఠశాలలో ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం సీబీఎస్ఈ సిలబస్ లో విద్యాబోధన ఉంటుందని వారు తెలియజేశారు.

## రామోజీ రావుకి భారత రత్న ఇవ్వాలి

▶▶ కేంద్ర ప్రభుత్వానికి సిపిఐ నాయుడు విజ్ఞప్తి



**పాలకీడు, విశాలభారతి:** అక్షర యోధుడు, మేరు నగధీరుడు చెరుకూరి రామోజీరావు మరణం సమాజానికి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. శనివారం నాడు ఆయన నేరేడుచర్ల లోని సిపిఐ కార్యాలయం ప్రజా భవన్ నుంచి విడుదల చేసిన పత్రిక ప్రకటనలో రాజకీయ, పాత్రికేయ, సినీ మరియు టీవీ రంగాల్లో తనదైన ముద్ర వేసిన మహానుభావుడని, సామాజిక ఉద్యమానికి ఊపిరి లూదిన యోధుడని, బుల్లితెర ద్వారా ప్రపంచ వీక్షణం పేరుతో 13 భాషల్లో వార్తలు అందించిన ఘన చరిత్ర ఆయనది అని పాడుతా తీయగా, పేరుతో ప్రేక్షకులపై సుమధుర సంగీత జల్లు కురిపించారని, సామాన్య కుటుంబంలో జన్మించి అసమాన్యుడిగా ఎదిగారని, ప్రపంచంలోనే అత్యంత అందమైన కళాఖండంగా రామోజీ ఫిలిం సిటీని తీర్చిదిద్దారని, కమ్యూనిస్టు పార్టీ అభిమానిగా జీవితాన్ని కొనసాగించారని, సిపిఐ నేత చంద్ర రాజేశ్వరరావు , సిపిఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య తనకు అత్యంత ఆరాధ్య నాయకులని తరచూ చెప్పుతుండే వారిని గుర్తు చేశారు. ఆయన మృతికి విప్లవ జోహార్లు అర్పిస్తూ వారి కుటుంబ సభ్యులకు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సూర్యాపేట జిల్లా సమితి పక్షాన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తునట్లు ఆయన ప్రకటించారు.

## పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

▶▶ టీచర్స్ బదిలీలు, ప్రమోషన్లను పారదర్శకంగా నిర్వహించాలి

▶▶ ఎస్ టి యూ జిల్లా అధ్యక్షుడు కొరవి సుధాకరాచారి




**తొర్రూరు, విశాలభారతి:** ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్టియూ జిల్లా అధ్యక్షుడు కొరవి సుధాకరా చారి డిమాండ్ చేశారు. తొర్రూరు పట్టణంలోని స్థానిక హైస్కూల్లో ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల మెడికల్ రియంబర్స్మెంట్, పిఆర్సి ఏరియల్స్, సరెండర్ బిల్స్ తో పాటు పెండింగ్ లో ఉన్న డి ఏ లను వెంటనే విడుదల చేసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఎస్టియు ప్రధాన కార్యదర్శి జి. యాకుబ్ రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, డి. చంద్రమౌళి, గుంటుక యాకయ్య, శ్రీనివాస్, రమేష్, హరికృష్ణ చారి, తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలి

▶▶ గిరిజన ఆశ్రమ పాఠశాలలో నాణ్యమైన విద్య

▶▶ తల్లిదండ్రులు విద్యార్థులను గిరిజన ఆశ్రమ పాఠశాలలోనే చేర్పించాలి



**మహబూబాబాద్, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో 2003 సంవత్సరం నుండి రాష్ట్ర వ్యాప్తంగా 319 పాఠశాలలో దాదాపు రెండు వేల మంది కాంట్రాక్టు రెసిడెన్షియల్ ఉపాధ్యాయులు సిఆర్టిగా అన్ని అర్హతలు కలిగి డిగ్రీ, పీజీ, పీహెచ్డీ, నేట్, సెట్, టెట్ డిస్టిక్ సెలక్షన్ కమిటీ ద్వారా నియమించబడి గత 20 సంవత్సరాలుగా నిర్విరామంగా మారుమూల గిరిజన ఆవాస ప్రాంతాలలో గూడాలలో పని చేస్తూ 13 శాతం ఉన్న గిరిజన విద్యా ప్రమాణాలను 95 శాతం పైగా సాధించుటలో విశేష కృషి చేస్తున్నాము. అలాగే ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ప్రతి సంవత్సరం విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచుకుంటూ పదవ తరగతి ఫలితాలలో అత్యుత్తమ ఫలితాలను సాధించడంలో కృషి చేయాలన్నారు. 2003 నుండి గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతాన్ని ప్రతి సంవత్సరం పెంచుకుంటూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పుడు దాదాపు లక్ష యాభై వేల విద్యార్థినీ విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

## బడిఈడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి




**బయ్యారం విశాలభారతి:** బడిబాటలో భాగంగా బయ్యారం మండలం గోరిమిళ్లలో జడ్పీహెచ్ఎస్ కంబాలపల్లి పాఠశాల మరియు గోరిమిళ్ల ప్రాథమిక పాఠశాల అధ్వర్యము లో బడి బాట ర్యాలీ తీయడం జరిగింది. విద్యార్థుల తల్లి తండ్రులను ఉద్దేశించి ప్రధానో ఉపాధ్యాయలు విష్ణువర్ధన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యా గొప్పతనం మరియు విద్యార్థుల కు ఉచిత పుస్తకంలు నోట్ బుక్స్ మరియు విద్యార్థుల కు డిజి తరగతి ల ద్వారా విద్యాబోధన జరుగుతుంది అన్నారు. ఈ కార్యక్రమం లో గోరిమిళ్ల పాఠశాల ప్రధానోపాద్యులు ఉపేందర్ రెడ్డి, ఉపాధ్యాయలు శ్రీధర్ రెడ్డి, రమేష్, సక్రు, రవీందర్, లలిత గ్రామస్తులు భద్రయ్య నర్సింహారావు రామన్న వెంకటమ్మలు పాలుగోన్నారు.

# గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి

▶▶ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరగాలి

▶▶ అదనపు కలెక్టర్ సి.హెచ్ ప్రియాంక

**సూర్యాపేట, విశాలభారతి:** గ్రూప్ 1 ప్రీమిలినరీ పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆదనవు కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక అన్నారు. శనివారం స్థానిక సాయి గౌతమి జూనియర్ కాలేజిలో చేపట్టిన ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్ష ప్రశాంత వాతావరణంలో జరగాలని, అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీటీవీ కెమెరా ముందు పరీక్షా పత్రాలు ఓపెన్ చేయాలని అలానే ఉదయం 8 గంటల నుండి అభ్యర్థులు లోపలికి పంపడం జరుగుతుందని అన్నారు. ఏర్పాటు చేసిన అన్ని కేంద్రాల్లో ఉదయం 9 గంటల నుండి బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని సూచించారు. అభ్యర్థులు కేంద్రాలకు త్వరగా చేరుకోవాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో ఉదయం 10 గంటలకు గేట్లు మూసివేయాలని ఎట్టి పరిస్థితుల్లో లోపలికి అనుమతి ఇవ్వొద్దని నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్.వి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్, రీజనల్ కో ఆర్డినేటర్ డా. వెంకటేశం, ప్రిన్సిపల్. వై . లక్ష్మయ్య గౌడ్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బడిఈడు పిల్లలని బడికి పంపండి

▶▶ మున్సిపల్ చైర్మన్ ▶▶ చిట్యాలలో బడిబాట కార్యక్రమం



**చిట్యాల, విశాలభారతి:** బడిఈడు పిల్లలని బడికి పంపాలని చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి అన్నారు. ప్రొ.జయశంకర్ బడిబాట కార్యక్రమంలో బాగంగా నిర్వహించిన కార్యక్రమంలో చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి పాల్గొని మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ బడి ఈడు పిల్లలందరినీ స్థానిక పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వ విద్యను ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుచే తరగతులు నిర్వహించడం జరుగుతుందని ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన విద్యని అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్. ఎం కరుణాకర్ రెడ్డి,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అండాలు, ఉపాధ్యాయులు జి. మాధవి, వై. రాధిక, పి. కవిత, వి.రవీందర్, ఎన్.సైదులు, జి.శైలజ, పి.వనజ, తెలంగాణ పిఆర్టియు మండల అధ్యక్షులు భిక్షపతి,వనజ, ఐఈఆర్టి బోయ శ్రీనివాస్, ఆవుల గీత, నాయకులు జమండ్ల శ్రీనివాస్ రెడ్డి, కోనేటి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రాజీమార్గమే రాజమార్గం

▶▶ పిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఏ ప్రదీప్




**రామన్నపేట, విశాలభారతి:** రాజీమార్గమే రాజమార్గమని కేసులు రాజీ కుదుర్చుకొని పరిష్కరించుకోవడం ద్వారా ఇద్దరికీ న్యాయం జరుగు తుందని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ ఏ ప్రదీప్, చందన లు పిలుపు నిచ్చారు. రామన్నపేట జూనియర్ సివిల్ జడ్జ్ అండ్ అడిషనల్ జూనియర్స్ సివిల్ జడ్జి కలిపి మొత్తము 1551 కేసులు పరిష్కారం కావడం జరిగింది. మండల్ లీగల్ సర్వీస్ అథారిటీ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో మెగా లోక్ అదాలత్ సందర్భంగా నిర్వహించిన సదస్సు లో పాల్గొని మాట్లాడుతూ దారిద్ర రేఖ దిగువన ఉన్న పేద నేరస్తులకు మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో ఉచిత సేవ నిర్వహించడం జరుగుతుందని వారు అన్నారు కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు క్లైంట్లు, ప్రజలు, పోలీసుయంత్రాంగం, అంతా కూడా సహకరించి కేసులను సత్వరమె పరిష్కరించడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉయ్యాల హనుమంతు, జినుకల ప్రభాకర్, పిపి ఖాజాఅలి న్యాయవాదులు పాల్వంచ జగతయ్య,మామిడి వెంకట్ రెడ్డి, దినేష్, సుక్క శ్రవణ్ కుమార్, నోముల స్వామి తదితరులు పాల్గొన్నారు.

## కౌశిక్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకో

▶▶ మునిగంటి సంతోష్



**సైదాపూర్, విశాల భారతి :** మంత్రి పొన్నం ప్రభాకర్ మీద హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సైదాపూర్ బీసీ సెల్ మాజీ మండలధ్యక్షులు మునిగంటి సంతోష్ ఘాటు వ్యాఖ్యలు చేశా రు. పాడి కౌశిక్ రెడ్డి ఒక రాజకీయ బ్రోకర్ అని, పదవుల కోసం అధికార వ్యామోహంతో ఇప్పటికీ మూడు పార్టీలు మార్చారంటూ దుయ్యబట్టారు. పాడి కౌశిక్ రెడ్డి కేసీఆర్ వదిలిన ఓ కుక్క అంటూ వివాదా స్పద వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ఉద్యమ ద్రోహి అయిన కౌశిక్ రెడ్డిని కేసీఆర్ ఈటల రాజేందర్‌పైకి ఉసిగొల్పారని అన్నారు.పొన్నం ప్రభాకర్ ని ఉద్దేశించి మాట్లాడిన మాటలు కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సంతోష్ తన దైన శైలిలో స్పందించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో భాగంగా పార్లమెం టు సాక్షిగా తన ఆవేశాన్ని చూపించరు. అదే ఆవేశంతో తిరుపతి రైలు, మా త శిశు హాస్పిటల్,ఎఫ్ఎం రేడియో, కేంద్రీయ విద్యాలయం ఇలా ఎంతో అభివృద్ధి జరిగిందని పాడి కౌశిక్ రెడ్డికి కౌంటర్ ఇచ్చారు.నీ భార్య, కూతు రు నువ్వు ఎన్నికల సమయం లో ప్రజలకు దండం పెట్టి మీరు ఓడి పోతే ఇక్కడే ఉరి వేసుకుని చస్తామని మా చవ యాత్రకు రావాలని ప్రజల ను బ్లాక్ మెయిల్ చేసి గెలిచినవ్ నీ జాతకం బయట పెడుతం బిడ్డ అని అన్నారు.

## తీన్మార్ మల్లన్న గెలుపుకు కష్టపడిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు



**తొర్రూరు, విశాలభారతి:** వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎన్నికలో తీన్మార్ మల్లన్న గెలుపు కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలను రిపోర్టర్ వేర్పుల మహేష్ తెలిపారు. శుక్రవారం రాత్రి తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీగా గెలిచిన సందర్భంగా తొర్రూర్ పట్టణ కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలే ఎజెండాగా తీన్మార్ మల్లన్న పోరాడుతూ ఎవరు ఎన్ని ఇబ్బందులు పెట్టిన,ఎవరు అన్ని కేసులు పెట్టిన వెనుకడుగు వేయకుండా నిత్యం ప్రజల సమస్యల కొరకు పోరాడుతూ బెదిరింపులకు, గురి చేసిన కూడా ఎవరికి భయపడకుండా సమస్యలను ఎదుర్కొని, నిత్యం ప్రజలకు, యువతకు అండగా నిలవాలని అన్నారు. తీన్మార్ మల్లన్న కు ఓటు వేసిన పట్టభద్రులందరికీ, మా తీన్మార్ మల్లన్న టీం సభ్యులందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై విచారణ జరపాలి

● ఏఐఎస్ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి.శివకుమార్



**తుర్కయంజాల్, విశాలభారతి:** నీట్ పరీక్ష ఫలితాల విషయంలో వస్తున్న అనుమానాలపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఏ ఐ ఎస్ ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పి. శివకుమార్ డిమాండ్ చేశారు. ఇటీవల ప్రకటించిన నీట్ ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం, వారి పరీక్ష కేంద్రం ఒకటే కావడం వల్ల అనుమానాలకు బలాన్నిస్తుందన్నారు. కాబట్టి తక్షణమే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించి పరీక్ష రాసిన మెడికల్ విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసే నీట్ పరీక్షను రద్దు చేయాలని దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పిన కూడా వారి మాటని పెడచెవిన పెట్టి, నిర్లక్ష్యం చేయడం ద్వారా వేలాది మంది ప్రతిభగల విద్యార్థులు మెడికల్ విద్యకు దూరమవుతున్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన ఫలితాలపై, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని శివ కుమార్ డిమాండ్ చేశారు.

## ఘనంగా జక్కిడి ప్రభాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు





**ఎల్బీనగర్ విశాలభారతి:** వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రిలో టిపీసీసీ ప్రతినిధి, ఎల్.బి నగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జక్కిడి ప్రభాకర్ రెడ్డి జన్మదినం సందర్భంగా పేషెంట్లకు పండ్లు,బ్రేడ్ల పంపిణీ కార్యక్రమం చేసి అనంతరం లింగోజిగూడ డివిజన్ లోని కృష్ణ నగర్ కాలనీ లో ఆదరణ ఫౌండేషన్ అనాధాశ్రమంలో సుమారు 150 మంది విద్యార్థులకు పుస్తకాలు మరియు పెన్నులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మన్సూరాబాద్ డివిజన్ అధ్యక్షులు బుడ్డ సత్యనారాయణ, జాలె వెంకట్ రెడ్డి, కొలన్ సుధాకర్,ఎర్ర మహేందర్, రాజశేఖర్ రెడ్డి, ఇతర నాయకులు వెంకట్ రెడ్డి,బుంగ రాజు,తదితరులు పాల్గొన్నారు.

## పజాసమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమం

▶▶ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం ఆదిభట్ల మున్సిపాలిటీలోని కొంగరకలాల్ రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ సమీకృత కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ నుండి యధావిధిగా నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ శశాంక ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉండడం వల్ల ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేయడం జరిగిందని ఆయన అన్నారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసినందున ప్రజావాణి కార్యక్రమం తిరిగి యధావిధిగా కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు

## రామోజీ రావుకు నివాళులర్పించిన మధుయాష్కి గౌడ్

**ఎల్బీనగర్ విశాలభారతి:** రామోజీ గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు మరణం పట్ల టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ పార్లమెంట్ సభ్యులు మధుయాష్కి గౌడ్ తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామోజీరావు మరణవార్త తనకు దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ప్రపంచంలోని ప్రఖ్యాత యూనివర్సిటలకు ధీటుగా రామోజీ ఫిలిం సిటీని నిర్మించటం ద్వారా భారతదేశం కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప వ్యక్తి రామోజీరావు అని పేర్కొన్నారు. తన జీవితంలో అనేక ఒత్తిడి లను, ఎన్నో ఆటుపోట్లను చూశారని, కానీ ఏనాడూ ఎవరికీ తలొగ్గకుండా లక్ష్యం వైపు ముందుకెళ్లారన్నారు. పత్రికా, మీడియా రంగంతో పాటు సినీ, వ్యాపార రంగాలలో ఆయన లేని లోటు పూడ్చలేనిదన్నారు.



# ప్రజలకు మంచి వైద్య సేవలు అందించాలి

● డాక్టర్ మాలకొండ మంచి హస్తవాసి గలవారు
● ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**మణుగూరు, విశాలభారతి:** పూర్తి ఏజెన్సీ గ్రామాలైన పినపాక నియోజకవర్గం లో మణుగూరు మండల కేంద్రంలో ప్రజలకు పేదలకు సాధ్యమైనంత తక్కువ ఖర్చులో మెరుగైన వైద్య సేవలు అందించాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం అశోక్ నగర్ లో డాక్టర్ మాల కొండయ్య నూతన హాస్పిటల్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో మొండి వ్యాధులను నయం చేసి మంచి హస్తవాసి కలవారిగా పేరున్న డాక్టర్ మాలకొండయ్య మణుగూరు కి సుపరిచితులని అలాంటివారు ఇక్కడ గతంలో ఉండి స్వగ్రామానికి వెళ్లి స్థిరపడి మళ్లీ ఇక్కడికి వచ్చి వైద్య సేవలు అందించడం మణుగూరు ప్రజల అదృష్టం అన్నారు. తక్కువ ఖర్చుతో అన్ని వ్యాధులకు చికిత్సలు అందించి అందరివాడిగా పేరు ఉన్న మాలకొండయ్య హాస్పిటల్ మణుగూరులో ప్రారంభం కావడం హర్షించదగిన విషయం అన్నారు. పేదలకు అతి తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్యం అందించడంలో మంచి పేరున్న మాలకొండయ్య అదే రీతిలో పినపాక నియోజకవర్గ ఏజన్సీ పెద ప్రజలకు తన నూతన హాస్పిటల్ లో తక్కువ ఖర్చుతో మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, శివ, సురేష్, బాబ్ జానీ, సుబ్బారెడ్డి, తరుణ్, తదితరులు ఉన్నారు.

## రామోజీ మృతి పట్ల ప్రముఖుల సంతాపం



**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:** ప్రముఖ మీడియా నిపుణులు, రామోజీ గ్రూప్ ఛైర్మన్ రామోజీ రావు(87) మృతి పట్ల రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ , ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్ , టిపీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకుంటు రామోజీ కుంటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పత్రికా, టీవీ, సినిమా రంగాల్లో రామోజీ సేవలతో ఎంతో మందికి ఉపాధి లభించిందని గుర్తు చేశారు. దీంతోపాటు రామోజీ శ్రమ, తపన, నిబద్ధత, క్రమ శిక్షణ కల్గిన మంచి వ్యక్తి అని వారు పేర్కొన్నారు.

## క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుంది

● ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి




**కూకట్ పల్లి, విశాలభారతి:** జాతీయ త్రోబాల్ 47వ ఛాంపియన్ షిప్ 2024 చివరి రోజు పోటీలకు ముఖ్య అతిధులుగా ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ఫైనాన్స్ కమిషన్ బోర్డు మెంబెర్ సుధీర్ రెడ్డి , రోడ్డు అండ్ ట్రాన్స్ పోర్ట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామిరెడ్డి, జాతీయ త్రోబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ రామన్ సాహ్ని, తెలంగాణ త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆర్గనైజింగ్ చైర్మన్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా.సత్యం శ్రీరంగం హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఫైనల్స్ లో విజయం సాధించిన విజేతలకు పసిడి, రజత, కాంస్య పథకాలను అందచేశారు. ఈ సందర్భంగా వారు మాటాడుతూ క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. దేశంలోని 26 రాష్ట్రాలకు సంబంధించిన త్రోబాల్ క్రీడాకారులను వెలికితీసి వారి ప్రతిభను గుర్తించేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రెటరీస్ నారాయణ రెడ్డి, గజ్జి భాస్కర్, ధాన్యం రాజ శేఖర్ రెడ్డి, ఎస్పీ వినోద్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు జైపాల్ రెడ్డి, చిలుక మధుసూదన్ రెడ్డి జనరల్ సెక్రటరీ కృష్ణ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రవి కుమార్, ఉపాధ్యక్షులు కృష్ణ రాజపుత్, చిత్ర షినోయ్, శ్వేతా రెడ్డి, కోశాధికారి జమీల్, కోచ్ లు, జాతీయ రిఫరీ బోర్డు మరియు క్రీడాకారులు పాల్గొన్నారు.

## తెలుగు పత్రిక రంగం ఉన్నతవరకు మీ పేరు కీర్తింపబడుతుంది



**కూకట్ పల్లి ,విశాలభారతి:** ఈనాడు సంస్థల ఛైర్మన్ రామోజీరావు గారికి కూకట్ పల్లి పాత్రికేయుల ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. వార్త పత్రికలు, మీడియా ఛానళ్ల రంగంలో తెలుగు మీడియా మొఘల్ గా కీర్తింపబడి, ప్రసిద్ధి చెందిన రామోజీరావు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమన్నారు. మీడియా రంగంలో దశాబ్దాలుగా ఎంతోమంది జర్నలిస్టులకు ఆయన ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ దాసరి రాహుల్ ప్రదీప్, గింజుపల్లి వేణు, తెల్ల హరికృష్ణ, సిహెచ్ క్రాంతి కుమార్, రిషి రాజు, మారుతి సాగర్, అనిల్, సత్య, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్డియల్ పూల ఆంథోనీ ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్యే శ్రీ గణేష్



**విశాలాభారతి,కంటోన్మెంట్ :** కంటోన్మెంట్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఎమ్మెల్యే శ్రీ గణేష్ కార్డినల్ హిస్ ఏమినేన్స్ మోస్ట్ రెస్పెక్టెడ్ కార్డియల్ పూల ఆంథోనీని మర్యాద పూర్వకంగా కలిశారు.ఎమ్మెల్యే గా విజయ సాధించిన ఆయన శనివారం ఆర్చ్ బిషప్ హౌస్ కు వెల్లారు. పూలు,శాలువతో అంథోని సత్కరించారు. అనంతరం శ్రీగణేష్ ను ఆశీర్వదించారు.ఈ కార్డియల్ కార్యక్రమంలో స్టేట్ మైనారిటీ కన్వీనర్ రేమండ్ హార్వుడ్ , కంటోన్మెంట్ ప్రెసిడెంట్ సామ్సంగ్ సూర్యకాంత్, వార్డ్-7 ప్రెసిడెంట్ ఆంథోని జోసెఫ్,మైకల్ అబ్రహం, జాన్ రాడ్రిక్స్, ప్రభు రజినీకాంత్, మరేష్ కుమార్, జస్ట్ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

## పత్రికా రంగంలో ఆయన సేవలు ఎనలేనివి

▶▶ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**నాచారం, విశాలభారతి:** రామోజీరావు లాంటి దార్శనికులు నూటికో కోటికో ఒకరు. మీడియా సామ్రాజ్యాధినేత, భారతీయ సినిమా దిగ్గజం అయినటువంటి ఆయన లేని లోటు ఎప్పటికీ పూడ్చ లేనటువంటిది. ఆయన మన మధ్యన ఇక లేరు అనే వార్త చాలా బాధాకరం అని చిన్నప్పటి నుండి ఈటీవీ వార్తలు చూస్తూ, ఈనాడు పేపర్ చదువుతూ పెరిగిన జ్ఞాపకాలే గుర్తుకువస్తున్నాయి. ఎన్నో వేల కుటుంబాలకి ఉపాది కల్పించిన దార్శినికుడు అక్షరం ఆయుధం అయితే ఎలా ఉంటదో చూపించిన లెజెండ్ అని ఆయన తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.

# ఆలయ అభివృద్ధికి హనుమాన్ భక్తులు విరాళం అందించడం అభినందనీయం

▶▶ రూ.35,500/- వంట సామగ్రి అందజేత
▶▶ పాపిరెడ్డి నగర్ బస్తీ అధ్యక్షుడు చంద్ర రెడ్డి

**కూకట్ పల్లి, విశాలభారతి:** కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ లోని శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ శివాలయం అభివృద్ధికి హనుమాన్ దీక్ష బూనిన స్వాములు తమ వంతు విరాళంగా రూ.35,500/- (ముప్పై ఐదు వేల ఐదు వందలు) లతో వంట సామగ్రి ని అందించడం అభినందనీయమని బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్ర రెడ్డి , ఆలయ కమిటీ అధ్యక్షుడు పేర్ని ధర్మారావు అన్నారు . గత 41 రోజులుగా హనుమాన్ దీక్ష చేపట్టిన హనుమాన్ భక్త బృందం స్వాములు జూన్ 1న హనుమాన్ జయంతి సందర్భంగా దీక్ష విరమణ చేశారు . సుమారు 70 మంది హనుమాన్ భక్తులు నిత్యం పూజలు చేసుకునేందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లను చేసి సహకరించిన సందర్భంగా ఆలయ అభివృద్ధిలో పాలుపంచుకునేందుకు స్వాములందరూ కలిసి ఆలయానికి కావలసిన పలు వంట సామాగ్రిని శనివారం ఆలయ కమిటీ, బస్తీ కమిటీ సభ్యులకు అందజేశారు . ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు ప్రతి ఏడు మాల విరమణ అనంతరం ఆలయానికి కావలసిన సామాగ్రిని ఇతర వస్తువులను అందజేస్తూ ఆలయ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు అన్నారు. ప్రతి ఒక్కరికి శ్రీ సీతారామాంజనేయ స్వామి కరుణాకటాక్షాలు సిద్ధిస్తూ అభివృద్ధి చెందాలని ఈ సందర్భంగా వారు కోరారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మెన్ గడ్డం రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి దొడ్ల రాంరెడ్డి, కోశాధికారి కిరణ్ కుమార్ , బస్తి ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్ , సభ్యులు దశరథ్ , తడకల రాజిరెడ్డి గురు స్వాములు కృష్ణారెడ్డి, మారుజోడు శంకర్, కుల్ల రాజు, మినుముల శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ చారి, ఎల్లకొండ జయకుమార్ గుప్త, మహేందర్, జగన్ మోహన్ రావ్, అజేయ్, శ్రీకాంత్, హరి, పుష్కన్ రెడ్డి, యాదగిరి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# బోడుప్పల్ రెండో డివిజన్‌లో అడుగడుగునా అక్రమ నిర్మాణాలే..

▸▸ అధికారుల మౌనం...అనేక అనుమానాలు. ▸▸ ప్రైవేటు వ్యక్తి జేబులోకి కార్పొరేషన్ ఆదాయం. ▸▸ మున్సిపల్ ఆదాయానికి భారీగా గండీ.

**మేడిపల్లి,విశాలభారతి :** కార్పొరేషన్ లో ఆదాయాన్ని పెంచి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు పెద్ద పీటా వెయ్యాలనే రాష్ట్ర ప్రభుత్వం ఆలోచనకు విరుద్ధంగా స్థానిక అధికారుల తీరు అద్దం పడుతుంది.బోడుప్పల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని రెండో డివిజన్ లో వందలాది కమర్షియల్ షెడ్ల నిర్మాణాలు జరిగిన కార్పొరేషన్ కు రావాల్సిన ఆదాయం మాత్రం ప్రైవేటు వ్యక్తుల జేబులోకి వెళ్తున్న కార్పొరేషన్ అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవంటే ఇక అధికారులు ఎందుకు చోద్యం చూస్తున్నారో అనేక అనుమానాలకు దారి చూస్తుంది.

### అనుమతుల ఆదాయం ఏటుపోతున్నాట్లు..

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల రెండో డివిజన్ పరిధిలో ప్రధాన మార్గం గుండా జరిగిన వందలాది కమర్షియల్ షెడ్ల నిర్మాపోయినట్లు మతులు లేని నిర్మాణాలే అధికంగా ఉన్నాయి.అయితే సదరు కమర్షియల్ షెడ్ల నిర్మాణాలకు టీఎస్ బీ పాస్ ప్రకారం అనుమతులు పోంది ఉంటే ఖచ్చితంగా కార్పొరేషన్ కు కోట్లాది రూపాయల ఆదాయం వచ్చి ఉండేది కానీ ఇక్కడ కార్పొరేషన్ కు రావాల్సిన ఆదాయం ఎక్కడికి పోయినట్లు అనేది అనేక అనుమానాలకు తావిస్తుంది.

### అధికారుల మౌనం వెనుక అనేక అనుమానాలు...

కార్పొరేషన్ పరిధిలోని రెండో డివిజన్ లో అనేక అక్రమ నిర్మాణాల అంశంలో కార్పొరేషన్ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారనేది అర్థం కాని ప్రశ్నగా మిగిలింది.సామాన్య ప్రజలు ఎవరైనా కొద్దిగా సెట్ బ్యాకులు లేకుండా ఇండ్లు కట్టుకుంటే నిబంధనల పేరిటా హడావుడి చేసే అధికారులు వందలాది షెడ్లు నిబంధనలను విరుద్ధంగా నిర్మాణాలు చేపడుతుంటే చర్యలు తీసుకోవడంలో ఎందుకు అలసత్వం వహిస్తునారో అర్థం కాని ప్రశ్నగా మిగిలింది.







### ఆక్రమాల కింగ్ మేకర్...

కార్పొరేషన్ పరిధిలోని రెండో డివిజన్ లో చేపట్టిన అనుమతులు లేని నిర్మాణాల విషయంలో బి.ఆర్.ఎస్ సీనియర్ నాయకుడు ప్రధాన భూమిక పోషించారనే విమర్శలు వినపడుతున్నాయి.అనుమతి లేని నిర్మాణాల జోలికి అధికారులు ఎవ్వరూ రాకుండా తానే చక్రం తిప్పినట్లు సమాచారం.అలా నిర్మాణా దారుల నుండి లక్షల రూపాయలు వసూళ్లు చేసుకోని జేబులు నింపుకుంటున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.ఇప్పటికైన అధికారులు సదరు అనుమతులు లేని నిర్మాణాల విషయంపై స్పందించి చర్యలు తీసుకోని కార్పొరేషన్ ఆదాయాన్ని పెంచుతారా లేదా వేచి చూడాలి.

### చెరువులను కూడా వదలని అక్రమార్కులు...

బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని చింతల చెరువులో అక్రమంగా మట్టి నింపీ ఇండ్ల నిర్మాణం చేపడుతుండడంతో చింతల చెరువు రూపు రేఖలు రోజుకో తీరుగా మారిపోతుంది.చింతల చెరువు ఎఫ్టీఎల్,బఫర్ జోన్ లో ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్న సంబంధిత అధికారులు కనీసం చర్యలు తీసుకోకపోవడం చూస్తుంటే అక్రమార్కులకు అధికారులే అండగా ఉన్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### చర్యలు తీసుకుంటాం...

కార్పొరేషన్ పరిధిలోని రెండో డివిజన్ లో చేపట్టిన అనుమతులు లేని షెడ్ల విషయంలో ఇప్పటికే టౌన్ ప్లానింగ్ అధికారులతో లిస్ట్ సిద్ధం చేశాం.ఎఫ్టీఎల్,బఫర్ జోన్‌లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఇరిగేషన్ అధికారులకు లేఖ రాస్తాం.అనుమతి లేని కమర్షియల్ నిర్మాణాల విషయంలో కఠిన చర్యలు తీసుకుంతామని బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్ జీ.రామలింగం తెలిపారు.

## ఖమ్మం జిల్లాలో ఊరిస్తున్న మేఘాలు.. కానరాని చినుకులు

ఉమ్మడి ఖమ్మం-విశాలభారతి : ఖమ్మం జిల్లాలో నేటికీ వర్షాల జాడ లేదు. రాష్ట్రంలో నాలుగైదు రోజుల కిందట నైరుతి రుతుపవనాలు ప్రవేశించాయి. ఆ ప్రభావం జిల్లాలో లేకపోవడంతో ఎండలు వేసవిని తలపిస్తున్నాయి. ప్రతి రోజూ సాయంత్రం మేఘాలు ఊరించడం, చిరు జల్లు పడడం తప్ప వర్షాలు పడటం లేదు. భూములు పదునెక్కేలా ఒక్క వర్షం కూడా పడలేదు. వర్షాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు.

### సాగుకు సిద్ధం చేసిన భూములు


ఖమ్మం జిల్లాలో ఖరీఫ్ కోసం భూములను రైతులు సిద్ధం చేశారు. ఈ ఏడాది వరి సాగుకు 2,83,943 ఎకరాలు, పత్తి సాగుకు 2,01,834 ఎకరాలు, మిర్చి సాగుకు 88,906 ఎకరాలు, మొక్కజొన్న సాగుకు 3,374 ఎకరాలు, కంది సాగుకు 1,005 ఎకరాలు, చెరుకు సాగుకు 2,432 ఎకరాలకు రైతులు రెడీగా ఉన్నారు. వరుణుడి కరుణ కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

### విత్తనాలు కూడా సిద్ధం

ఖరీఫ్ నిమిత్తం ఖమ్మం జిల్లాలో 70,986 క్వింటాళ్ల వరి విత్తనాలను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేశారు. అదేవిధంగా 5 లక్షల ప్యాకెట్ల పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచారు. 90 క్వింటాళ్ల మిర్చి విత్తనాలు, 135 క్వింటాళ్ల మొక్కజొన్న విత్తనాలు, 1229 క్వింటాళ్ల పెసర విత్తనాలు కూడా రెడీగా ఉన్నాయి. నకిలీ విత్తనాల విక్రయాలు జరగకుండా జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ చర్యలు చేపట్టారు.

### అందుబాటులో ఎరువులు

ఖరీఫ్‌లో రైతులకు కావలసిన యూరియా, డీఏపీ, ఎంఓపీ, కాంప్లెక్స్, ఎస్ఎస్ పి రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయి. మొత్తం రెండు లక్షల 24 వేల 819.88 మెట్రిక్ టన్నుల ఎరువులను పంపిణీకి అధికారులు సిద్ధం చేశారు.



## అదరగొట్టిన ఆస్ట్రేలియా.. ఇంగ్లండ్‌పై ఘన విజయం




టీ20 ప్రపంచకప్‌లో భాగంగా ఇవాళ ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా.. ఇంగ్లండ్ ముందు 202 పరుగుల భారీ టార్గెట్ సెట్ చేసింది. అనంతరం డిఫెండింగ్‌లోనూ సత్తా చాటి ఇంగ్లండ్‌పై 36 పరుగుల తేడాతో గెలుపొందింది.
తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా బ్యాటర్లు అదరగొట్టారు. ట్రావిస్ హెడ్ (18 బంతుల్లో 34 పరుగులు), డేవిడ్ వార్నర్ (16 బంతుల్లో 39 పరుగులు), మిచెల్ మార్ష్ (25 బంతుల్లో 35 పరుగులు), గ్లెన్ మాక్స్‌వెల్ (25 బంతుల్లో 28 పరుగులు), మార్కస్ స్టోయినిస్ (17 బంతుల్లో 30 పరుగులు), అద్భుతంగా రాణించారు.
అనంతరం చేజింగ్‌కు దిగిన ఇంగ్లండ్ బ్యాటర్లలో ఫిలిప్ సాల్ట్ (23 బంతుల్లో 37 పరుగులు), జోస్ బట్లర్ (28 బంతుల్లో 42 పరుగులు), మొయిన్ అలీ (15 బంతుల్లో 25 పరుగులు), హ్యారీ బ్రూక్ (16 బంతుల్లో 20 పరుగులు నాటౌట్) రాణించినప్పటికీ నిర్ణీత ఓవర్లలో ఆస్ట్రేలియా నిర్దేశించిన లక్ష్యాన్ని చేధించలేకపోయారు. దీంతో 36 పరుగుల తేడాతో ఆస్ట్రేలియా తమ రెండో విజయం సాధించింది. ఈ విజయంతో గ్రూప్-బిలో నాలుగు పాయింట్లతో అగ్రస్థానానికి చేరుకుంది.

# దొంగతనాలకు పాల్పడుతున్న రెండు ముఠాల అరెస్ట్

▸▸ వారి నుండి 22 సెల్ ఫోన్లు, నాలుగు బైకులు స్వాధీనం

**సికింద్రాబాద్ ,విశాలభారతి :** జల్సాలకు అవసరమైన డబ్బుల కోసం సెల్ ఫోన్ స్నాచింగ్ , బైక్ దొంగతనాలకు పాల్పడుతున్న రెండు ముఠా లకు చెందిన ఏడుగురు సభ్యులు, కొట్టేసిన సెల్ ఫోన్ ను తక్కువ ధరలు కుంటున్న నలుగురు సెల్ ఫోన్ షాపు నిర్వాహకులను ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 22 సెల్ ఫోన్స్ , దొంగిలించిన నాలుగు బైకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఈస్ట్ జోన్ డిసిపి రావుల గిరిధర్, ఓయూ డివిజన్ ఏసిపి గ్యార. జగన్ తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఛత్రినాక గౌలిపురాకు చెందిన కంసాల అరుణ్ కుమార్ ,ఎలియాస్ నాని (23) పాత నేరస్థుడు. సెల్ ఫోన్స్ స్నాచింగ్, బైక్ దొంగతనాలకు పాల్పడి పలుమార్లు జైలుకు వెళ్ళాడు. ఇతనిపై మొగల్ పురా, ఫలక్ నుమా,అబిడ్స్, సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఆరు కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం సరూర్ నగర్ నివాసం ఉంటున్న అరుణ్ కుమార్ అదే ప్రాంతానికి చెందిన తుస్మద్ స్నేహా ఎలియాస్ నిక్కు (20) ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఈజీ మనీ కోసం తనతో పాటు తన భార్యను కూడా ఈ రొంపిలోకి దింపిన అరుణ్ కుమార్ సాగర్ ఘాటుకు చెందిన పనగంటి రఘుబాబు (20), మరో మైనర్ తో కలిసి ఒక ముట్టగా ఏర్పడ్డారు. అలాగే మరో గ్యాంగ్ మల్కాజ్గిరి వసంతపురి కాలనీకి చెందిన డెకొరేషన్ పనులు చేసే మూస సుమన్ ఇలియాస్ టీంకు (19), లాలాగూఢ శాంతినగర్ కు చెందిన డెకరేషన్ పనులు చేసే మల్తుం కార్ మధు (19), మల్కాజ్ గిరి వసంతపురి కాలనీ చెందిన ప్రైవేట్ ఎంప్లాయ్ కాణిపాక ప్రశాంత్ ఇలియాస్ చింటూ(21) మరో ముఠాగా ఏర్పడి చైన్ స్నాచింగ్ లకు పాల్పడుతున్నారు.ఇందు కోసం వారు దొంగలించిన బైక్లపై రాత్రి సమయాల్లో రోడ్లపై తిరుగుతూ ఫుడ్ పాతుల మీద నిద్రిస్తున్న వారు, ఒంటరిగా వెళుతున్న వారిని టార్గెట్ చేసి మొదట రెక్కి నిర్వహించి తర్వాత సెల్ ఫోన్లు దొంగలించి ఉడా యిస్తున్నారు. ఈ రెండు ముఠాల సభ్యులు తాము దొంగిలించిన సెల్ ఫోన్లను సికింద్రాబాద్ సిక్కు విలేజ్ కు చెందిన సెల్ ఫోన్ మెకానిక్ మహమ్మద్ ఉరఫ్ చిచ్చా (65), తుకారం గేట్ కు చెందిన ఆటో డ్రైవర్ ఇలియాస్ అఫ్రోజ్(44), లాలాగూడ కు చెందిన సెల్ ఫోన్ మెకానిక్ షేక్ అలీ (39), ఉప్పుగూడ కు చెందిన వి .రాజు(23)లకు రూ.2వేల నుంచి రూ.3వేలకు విక్రయిస్తున్నారు. ఇలా విక్రయించగా వచ్చిన డబ్బులను అందరు సమానంగా పంచుకొని తమ జల్సాలకు తీర్చుకుంటున్నారు. శుక్రవారం రాత్రి 2 గంటల సమయంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా తార్నాక బస్టాప్ లో నిద్రిస్తున్న ఓ వ్యక్తి పక్కనే ఓ మైనర్ బాలుడితోపాటు మరో యువకుడు నిలబడి ఉండటానికి గమనించిన పోలీసులు వారి వద్దకు వెళ్లే లోపే వారు పారిపోతుండగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. ఇదే సమయంలో నిద్రిస్తున్న వ్యక్తిని లేపి అతని సెల్ ఫోన్ గురించి వాకప్ చేయగా తన సెల్ ఫోన్ చోరీకి గురైనట్లు అతడు పోలీసులకు చెప్పాడు. ఇదిలా ఉంటే ఈనెల 3న తార్నాక బస్టాప్ లో నిద్రిస్తున్న వ్యక్తి సెల్ ఫోన్ కూడా ఇదే రీతిలో లాక్కొని పరార్ అవుతుండగా పెట్రోలింగ్ పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని విచారించగా సెల్ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు వారు అంగీకరించారు. అలాగే గతంలో కూడా ఎక్కడెక్కడ సెల్ఫోన్లు దొంగిలించారు ఆ వివరాలు కూడా వారు పోలీసులకు వెల్లడించారు. సెల్ ఫోన్లు కాకుండా పార్కింగ్ చేసిన బైకులను తొంగిలించి వాటిని డిస్మెంటల్ చేసి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు.తాము దొంగిలించిన బైకులతోనే సెల్ ఫోన్స్ వాచింగ్ లకు పాల్పడుతున్నట్టు పోలీసులకు వెల్లడించారు. రెండు గ్యాంగుల నుంచి 22 సెల్ ఫోన్లు, సెల్ఫోన్ స్నాచింగ్లకు ఉపయోగిస్తున్న నాలుగు బైకులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెల్ ఫోన్ దొంగతనం పాల్పడుతున్న ఏడుగురు ముఠా సభ్యులతో పాటు, వాటిని కొనుగోలు చేసి ఇతరులకు విక్రయించడం, లేదా పార్టు పార్టుగా విడదీసి అమ్ముతున్న నలుగురు రిసీవర్లను కూడా అరెస్ట్ చేసిన పోలీసులు రిమాండ్ కు తరలించారు.

## పురుగుల నియంత్రణకు లింగాకర్షణ బుట్టలు వాడాలి



**సైదాపూర్, విశాల భారతి :** పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నియంత్రణ కోసం లింగాకర్షణ బుట్టలు వాడాలని నవ క్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ ప్రతినిధి వంగ రఘు అన్నారు. శనివారం ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి గ్రామంలో రైతులకు కార్గిల్ సంస్థ,సేఫర్డ్ సంస్థ సహకారంతో లింగాకర్షణ బుట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంగ రఘు మాట్లాడుతూ పత్తి పండించే రైతులందరూ మంచి పత్తిని పండించాలంటే పురుగుల నియంత్రణ చాలా అవసరమని,అందులో ముఖ్యంగా గులాబీ రంగు పురుగు అనేది ఎక్కువగా నష్టం చేస్తున్నదని, దీనివల్ల పత్తి దిగుబడి తగ్గడం,పత్తి నాణ్యత తగ్గడంతో మార్కెట్లో మంచి రేటు రాకపోవడం వలన రైతులకు చాలా నష్టం జరుగుతుందన్నారు. గ్రామంలోని రైతులందరూ పత్తి పెట్టిన 45 రోజులకు వీటిని పెట్టడం వలన మగ రెక్కల పురుగులను నియంత్రణ జరుగుతుందని, మంచి పత్తిని పండించాలంటే రైతులందరూ ఎండాకాలం దుక్కులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కేశవపూర్ రైతు ఉత్పత్తిదారుల ప్రతినిధులు, రాజేందర్, లత. రజిత పత్తి రైతులు 90 మంది పాల్గొన్నారు.

## ప్లాట్లు కోల్పోయిన వారికి న్యాయం చేయండి

▶▶ లక్షలు వెచ్చించి పాట్లు కొన్న బాధితులు



**వనపర్తి విశాల భారతి:** గత ప్రభుత్వం మర్రికుంట సమీపంలో ఉన్న సర్వే నెంబర్లు 172, 173, 174, 175, 177, 178, 183 గల పట్ట భూమిలో కొన్నేళ్ల క్రితం ప్లాట్లు కొన్నారు. అట్టి ప్లాట్లను కొందరు నాయకులు బాధితుల నుంచి లాక్కొని ప్లాట్లను తొలగించి, పూడికలు గుంతలు ఏర్పాటుచేసి బ్రతికెందుకు గూడు లేకుండా చేశారని ప్లాట్ల బాధితులు వాపోయారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఛాంబర్ లో మర్రికుంట ప్లాట్లు కూలిపోయిన బాధితులు వచ్చి న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పుట్టపాకల మహేష్ వారితో మాట్లాడుతూ.. జరిగిన తప్పిదాలు ఏమి జరిగాయని ఉన్నతాధికారులను, కమిషనర్ ను అడిగి తెలుసుకుని, ప్లాట్లల్లో వాస్తవికత ఎంత ఉందని పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని బాధితులకు సూచించారు. శ్రీనివాసపురం మున్సిపాలిటీలో విలీనం కాకముందుకు జరిగిన అంశాన్ని, మున్సిపాలిటీలో విలీనమైన పరిస్థితులను గమనించి ఎక్కడ లోపం జరిగిందో తెలుసుకుంటామన్నారు. బాధితులు సుమారుగా 100 ప్లాట్ ను కోల్పోయినట్లు చైర్మన్ కు వివరించారు. అప్పులు చేసి కొన్న ప్లాట్లను తొలగించి పూడికలు, గుంతలు ఏర్పాటుచేసి బాధితులను ఇబ్బందులకు గురి చేసేందుకే ప్రయత్నాలు చేశారని వాపోయారు. ఈ సమావేశంలో మర్రికుంట ప్లాట్ల బాధితులు బిక్షపతి, మాలిక్ భాష పలువురు ఉన్నారు.

## సినీ, మీడియా రంగంలో తనదైన ముద్ర వేసిన వ్యక్తి రామోజీరావు



**వనపర్తి విశాల భారతి:** సినిమారంగంలో, మీడియా రంగంలో అనూ హ్యమైన మార్పులు తీసుకువచ్చి ఎప్పటికప్పుడు ప్రజాక్షేత్రంలో ప్రశ్నించే గొంతుకగా వెలుగెత్తిన అక్షర యోధుడు రామోజీరావు మరణం మీడియా రంగానికి, అటు సిని రంగానికి తీరని లోటని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. 1974లో ఈనాడు పేపర్ ను స్థాపించి పత్రికా రంగంలో తనదైన ముద్రను వేశారని ఆయన అన్నారు. తెలుగు భాషను కాపాడుకునేందుకు ప్రతి అక్షరం తెలుగులోనే రాయాలని సంకల్పించి, తెలుగు వెలుగు మాస పత్రికను స్థాపించారని ఆయన గుర్తు చేశారు. ఉషా కిరణ్ మూవీస్ ను స్థాపించి ప్రపంచ గుర్తింపు పొందిన ఫిలిం సిటీని ఏర్పా టు చేసి తెలుగు చలనచిత్ర రంగంలో చెరిగిపోని ముద్ర వేశారు. ఈ సంద ర్భంగా రామ్మోజి రావు మృతి పట్ల ఆయన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

## రామోజీరావు లేని లోటు తీరనిది

▶▶ ఆయన చిత్రపటానికి నివాళులర్పించిన జర్నలిస్టులు




**ఆర్మూర్, విశాల భారతి :** రామోజీ సంస్థల అధినేత, జర్నలిజానికి మార్గదర్శకం చూపించిన మహా నాయకుడు రామోజీరావు శని వారం ఉదయం కన్నుమూశారు. ఈ వార్త తెలియగానే ఆర్మూర్ ప్రెస్ క్లబ్ సభ్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆర్మూర్ పట్టణంలోని ప్రెస్ క్లబ్ భవనంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనం తరం జర్నలిజానికి చేసిన సేవలను కొనియాడారు ఈ కార్యక్రమంలో నెమలి ప్రశాంత్, పుట్టి మురళి,సంజీవ్, ప్రశాంత్, క్రాంతి, రితీష్, మనోహర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

# అక్షర రూపంలో ప్రజల పక్షపాతి రామోజీరావు

▶▶ గుండ్రాతి మధు గౌడ్



**వనపర్తి విశాల భారతి:** జర్నలిజానికి నిజమైన మార్గదర్శి, ప్రజల గొంతుకై ప్రజల పక్షాన ప్రశ్నించే ప్రజల పక్షపాతి రామోజీరావు అని, ఎంతోమంది జర్నలిస్టులను తీర్చిదిద్దిన ఘనత రామోజీరావుకే దక్కిందని టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా అధ్యక్షుడు గుండ్రాతి మధు గౌడ్ తన సంతాపాన్ని తెలియజేశారు. శనివారం తెల్లవారుజామున హైద రాబాదులోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రామోజీరావు తుది శ్వాస విడిచారు. దీంతో జిల్లా టీయూడబ్ల్యూజే (ఐజేయు) జర్నలిస్ట్ యూనియన్ నాయకులు రామోజీరావు మృతి పట్ల తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఒక ప్రకటనలో గుండ్రాతి మధు గౌడ్ తన సంతాపాన్ని తెలియపరుస్తూ ప్రముఖ పత్రిక సంపాదకుడు, వ్యాపారవేత, సినీ నిర్మాత, రామోజీ ఫిలిం సిటీ అధినేత రామోజీరావు మృతి చెందడం జర్నలిజానికి తీరని లోటు అని పేర్కొన్నారు. పత్రిక ప్రపంచంలో తనదైన ముద్ర వేసుకొని గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం దక్కించుకున్న మహోన్నతుడు రామోజీరావు అని తెలిపారు. మంచితనం ఉన్న న్నాళ్లు, న్యాయపోరాటం నాలుగు పాదాలపై నిలబడినన్ని నాళ్ళు రామోజీరావు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ఉంటారని తెలియజేశారు. కష్టే ఫలి అని నిర్వచనానికి నిలువెత్తు నిదర్శనం, సామాన్య మధ్యతరగతి కుటుం బంలో జన్మించిన ఆయన అంచలంచెలుగా ఎదుగుతూ నేడు వేల మందికి ఉపాధి కల్పించి, నూతన మొరవాడిని సృష్టించాడని కొనియాడారు. రామోజీరావు మృతి పట్ల పలువురు ఐజేయు సభ్యులు సంతాపం వ్యక్తం చేశారు.

## నేడు గ్రూప్ 1 పరీక్ష నిర్వహణ పకడ్బందీగా నిర్వహించాలి

● జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్



**వనపర్తి విశాల భారతి:** నేడు జరగబోయే గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 9 గంటల నుండి 10 గంటల లోపు పరీక్షా కేంద్రంలో హాజరు అవ్వాలని జిల్లా కలెక్టర్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్ 1 ప్రిలిమినరీ పరీక్షల నిర్వహణకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ఇచ్చిన నియమ నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాలని ఆదేశించారు. 10 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షా కేంద్రంలో అనుమతి లేదని స్పష్టంగా వివరించారు. ఉదయం 9 గంటల నుండి అభ్యర్థులను పరీక్షా కేంద్రంలో అనుమతించాలని , 10 గంటలకు గేట్లు మూసి వేయాలని అన్నారు. 9:30 నుండి బయోమెట్రిక్ హాజరు తీసుకోవాలని సూచించారు. పరీక్ష అయిపోయే వరకు మెడికల్ ఎమర్జెన్సీ ఉంటే తప్ప మధ్యాహ్నం 1.00 గంటకు ముందు ఏ ఒక్క అభ్యర్థిని పరీక్షా కేంద్రం నుండి బయటకు పంపడానికి వీలు లేదని తెలియజేశారు. బాధ్యతలు అప్పగించిన అధికారులు, సిబ్బంది ఎలాంటి పొరపాట్లు, నిర్లక్ష్యానికి తావు లేకుండా అత్యంత జాగ్రత్తగా విధులు నిర్వహించాలని, ఒక్క తప్పు జరగడానికి వీలు లేదని హెచ్చరించారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే మాత్రం చర్యలు కఠినంగా ఉంటాయనీ హెచ్చరించారు.

## ఘనంగా కనకగుర్గ గుడి చైర్మన్ జన్మదిన వేడుకలు



**చిట్యాల, విశాలభారతి:** పట్టణంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి గుడి చైర్మన్ మారగోని ఆంజనేయులు గౌడ్ జన్మదిన వేడుకలను చిట్యాల గౌడ సంక్షేమ సంఘ సభ్యుల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంఠమహేశ్వర స్వామి గుడి దగ్గర కేకు కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు మారగోని రమేష్ గౌడ్, కోశాధికారి రేగులగడ్డ నరసింహ గౌడ్, పుల్లెంల కోటయ్య గౌడ్, ఉపాధ్యక్షులు ఉయ్యాల మల్లేష్ గౌడ్, పంతంగి వెంకన్న గౌడ్,కాసుల సత్యనారాయణ గౌడ్,కార్యవర్గ సభ్యులు పాలకూరి వెంకన్న గౌడ్,బొడ్డు శంకర్ గౌడ్, కొంపెల్లి శ్రీనివాస్ గౌడ్,యూత్ అధ్యక్షులు మారగోని శ్రవణ్ గౌడ్, సభ్యులు పంతంగి కరుణాకర్ గౌడ్, కల్లెం నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో రామోజీరావుకి నివాళులు



**మరిపెడ, విశాలభారతి:** శనివారం తెల్లవారుజామున మృతి చెందిన మీడియా మొఘల్ చెరకూరి రామోజీ రావుకు మరిపెడ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మరిపెడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు పర్వతం చంద్రశేఖర్ మాట్లాడుతూ వ్యక్తిగా మొదలైన రామోజీ రావు ప్రస్థానం లక్షలాది మందికి అండగా నిలబడే వ్యవస్థగా ఎదిగిన తీరు నేటి యువతరానికి ఆదర్శనీయమన్నారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమైనవన్నారు. మార్గదర్శి చిట్ ఫండ్స్ తో మొదలై సితార సినీపత్రిక, ఈనాడు దినపత్రిక,ప్రియా పచ్చళ్ళు, కళాంజలి షోరూమ్లు , ఈటీవీ చానళ్ళు నెలకొల్పి తిరుగులేని పారిశ్రామిక వేత్తగా దేశంలో ప్రఖ్యాతి గాంచారని పేర్కొన్నారు.ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన రామోజీ ఫిలిం సిటీ నిర్మాణం ఆయన జీవితంలో కలికితురాయిగా నిలిచిందన్నారు. 80కి పైగా చలనచిత్రాలను నిర్మించిన కళామ్మతల్లి ముద్దుబిడ్డగా అభివర్ణించారు. క్రమశిక్షణ , సమయపాలన,నిబద్ధతలతో చేపట్టిన ప్రతి రంగంలో నూతన వరవడి సృష్టించి చరిత్రలో నిలిచారని కొనియాడారు. కార్యక్ర మంలో డోర్నకల్ ఎలక్రానిక్ మీడియా ప్రధాన కార్యదర్శి గండి విష్ణు,మరిపెడ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మారం అనంతరాములు, కోశాధికారి సతీష్, సీనియర్ రిపోర్టర్లు దాసరోజు బాలకృష్ణ, కారంపూడి వెంకటేశ్వర్లు, గంధసిరి ఉప్పలయ్య,చింత వెంకన్న పాల్గొన్నారు.

## అ'పూర్వ' విద్యార్థుల సమ్మేళనం

▶▶ 24ఏళ్ల తర్వాత కలిసిన పది విద్యార్థులు



**మరిపెడ, విశాలభారతి:** మండల కేంద్రంలోని మండల కేంద్రంలోని శ్రీరాఘవ విజ్ఞానికేతన పాఠశాలలో 2000-2001 బ్యాచ్ కు చెందిన పదవ తరగతి విద్యార్థులు శనివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అంతా కలిసి సంతోషంగా గడిపారు. 24 ఏళ్ల తర్వాత ఒకరొనొకరు కలుసుకోవటంతో ఆత్మీయంగా పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుని ఒకరి బాగోగులు, విశేషాలు తెలుసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనాని అప్పటి వారి గురువులను పిలుచుని వారిని ఘనంగా సత్కరించుకున్నారు. విద్యార్థి దశలో ఉన్న వారు నేడు మంచి స్థానాల్లో ఉండటంతో గురువులు వారికి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు అబ్బయ్య, రాజేందర్, నరేందర్, వెంకోబా, సురేందర్, శ్రీను, అజ్గర్, కృష్ణ, అరుణ అజ్జత్, భీమా తదితరులు పాల్గొన్నారు.

# యువకుడు దారుణ హత్య





▶▶ కుటుంబ కక్ష్యలే కారణమా

▶▶ మందు తాగించి హత్య చేసిన వైనం

**ఇందల్ వాయి, విశాల భారతి :** ఇందల్వాయి మండలం మేఘ్య నాయక్ తండ గ్రామానికి చెందిన లాకవత్ వెంగల్(45) అనే వ్యక్తి డిచ్పల్లి మండలం సిఎంసి హాస్పిటల్ పరిధిలో శుక్రవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. సీసీ కెమెరాల ఆధారంగా ప్రధాన నిందితుడు అదే గ్రామానికి చెందిన బిక్య ను పట్టుకునీ పోలీసులు విచారణ జరుపుతున్నారు. హత్య ఒకరు చేశారా లేక ఇంకా ఎవరన్నా ఉన్నారా అనే కోణం లో పోలీసులు విచారణ చేపడుతున్నారు. పోస్ట్ మార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. ఇదిలా ఉండగా మిగతా నిందితులందరినీ పట్టుకోవాలని మృతుడి తరపు బంధువులు ఆందోళన చేపట్టారు. ప్రధాన నిందితుడైన బిక్యా ఇంటికి నిప్పు పెట్టి ధ్వంసం చేశారు. మృతునికి భార్య ముగ్గురు ఆడ పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల కథనం ప్రకారం గురువారం మధ్యాహ్నం ఇంటి నుండి బయలు దేరి శుక్రవారం రాత్రి వరకు ఇంటికి రాలేదని అన్నారు. బందువుల దగ్గర గాలించినా ఆచూకీ లభించక పోవడంతో శుక్రవారం పోలీసులకు పిర్యాదు చేశారు. అదే రోజు రాత్రి డిచ్ పల్లి మండలం లోని సీఎంసి కళాశాల వద్ద శవమై కనిపించడం తో పోలీసులు సీసీ కెమెరాలు గమనించగా అదే గ్రామానికి చెందిన బిక్యా సీసీ కెమెరాల ఫుటేజ్ లో కనిపించడం తో పోలీసులు వెంటనే అతన్ని అదుపులోకి తీసుకుని విచారణ చేపడుతున్నారు.

### కుటుంబ కక్ష్యలే కారణామా:

కుటుంబ కక్ష్యాలే హత్యకు కారణమని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గత నాలుగు రోజులుగా వెంగల్ చిన్న నాన్న కొడుకులతో తరచుగా గొడవ జరుగుతున్నదని , బైక్యా ను అడ్డు పెట్టుకొని వెంగల్ ను హత్య చేయించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు . భిక్య తో పాటు మిగతా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకోవాలని పోలీసులను కోరుతున్నారు.

### మేగ్య నాయక్ తండాలో పోలీసుల బందోబస్తు:

బిక్యాతో మిగతా నిందితులను పట్టుకుని అరెస్టు చేసేంత వరకు మృతదేహాన్ని పోస్టుమార్టం పంపేది లేదని గ్రామస్తులు డిచ్ పల్లి పోలీస్ స్టేషన్ ఎదుట బైటఇంచారు. మెగ్య నాయక్ తండాలో వెంగల్ కుటుంబీకులు బిక్య ఇంటికి నిప్పు పెట్టారు. ఇంట్లోని వస్తువులను బయట పడేశారు. దీంతో పోలీసులు భారీ ఎత్తున భిక్యా ఇంటి ఎదుట పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఇరువర్గాల వారికి పోలీసులు నచ్చజెప్పి గ్రామస్తులను శాంతింప జేసే ప్రయత్నం చేశారు. ఇరువర్గాల మధ్య ఏం జరుగుతుందో నని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

సినిమా
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com

శుక్రవారం,
05.04. 2024
హైదరాబాద్



# రామోజీ అస్తమయం



ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ రామోజీరావు (88) శనివారం ఉదయం కన్నుమూశారు. ఇక రామోజీ రావు మృతితో మీడియా రంగంతో పాటు సినీ రంగం శోకసంద్రంలో మునిగిపోయింది. ఇక రామోజీరావు కెరీర్‌లో కీలక మలుపు అంటే ఈనాడు పత్రికను మొదలుపెట్టడమే. వైజాగ్ వేదికగా 1974లో ఈనాడు పత్రికను ప్రారంభించిన ఆయన దాని ద్వారా కొన్ని వేలమంది పాత్రికేయులను తయారు చేశారు. దీని తర్వాత 1995 ఆగస్టులో తెలుగు ప్రేక్షకుల కోసం ఈటీవీని ప్రారంభించారు. తక్కువ సమయంలోనే ఈ ఛానల్ అభిమానులు మనసులను దోచుకుంది. ఇక ఈటీవీలో వచ్చే రాత్రి 9 గంటల వార్తలకు అయితే ఇప్పుడు కూడా జనాలు ఆసక్తిగా చూస్తారు. మరోవైపు సినీ రంగంలో కూడా రామోజీ రావు విశేష కృషి చేశారు. తన సొంత నిర్మాణ సంస్థ ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్‌పై ఇప్పటివరకు వివిధ భాషల్లో 87 సినిమాలు నిర్మించారు. ఈ బ్యానర్‌తోనే టాలీవుడ్ నటులు ఎన్టీఆర్, కల్యాణ్ రామ్, దర్శక దిగ్గజం రాజమౌళి తదితరులు సినిమా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. ఇక ఉషాకిరణ్ మూవీస్ బ్యానర్‌లో చివరిగా 2015లో రాజేంద్రప్రసాద్ నటించిన దాగుడుమూత దండాకోర్ సినిమా వచ్చింది. కేవలం పెద్ద తెరకు మాత్రమే పరిమితం కాకుండా బుల్లితెరపై తన సత్తా చూపించారు. భాగవతం, అన్వేషిత, ఎండమావులు, ఆడపిల్ల, పంచతంత్రం లాంటి బ్లాక్ బస్టర్ ధారవాహికలను అందించారు. కాలంతో పాటు మారుతూ.. రీసెంట్‌గా ఓటీటీలో కూడా ఎంట్రీ ఇచ్చారు రామోజీ రావు. ఈనాడు గ్రూప్ నుంచి వచ్చిన ఓటీటీ వేదిక ఈటీవీ విన్. కేవలం తెలుగు సినిమాలతో పాటు తెలుగు ధారవాహికలు, ప్రోగ్రామ్స్ ఈ ఓటీటీలో ప్రసారం అవుతుంటాయి.



తెలుగు పత్రికా రంగంలో మకుటం లేని మహారాజు గా వెలుగొందారు రామోజీ రావు. తెలుగులోనే కాదు దేశ పత్రికా రంగంలోనే ఓ కొత్త ఒరవడిని సృష్టించి భావితరాల పత్రికా ప్రతినిధులకు మార్గదర్శి గా నిలిచారు. తెలుగు నుడికారానికి ఒక కొత్త కళను తెచ్చారు. జర్నలిజానికి కొత్త సొబగును దిద్దారు. చిత్ర సీమలో అదే తీరున సాగి ఉషోదయ కిరణాలను ప్రసరింప చేశారు. ప్రపంచంలోనే అతిపెద్ద స్టూడియో గా రామోజీ ఫిలిం సిటీని తెలుగు నేలపై నెలకొల్పారు. ఏది చేసినా తనదైన బాణీ కల్పిస్తూ సాగిన రామోజీరావు ఇక లేరు అన్న వార్త ఆవేదన కలిగిస్తోంది. మా తండ్రిగారు నందమూరి తారక రామారావు గారితో ఆయన అనుబంధం ప్రత్యేకమైనది. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.

- నందమూరి బాలకృష్ణ



రామోజీరావుకు నివాళులర్పించి.. కుటుంబ సభ్యులను ఓదార్చిన చిరంజీవి ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు పార్థివదేహానికి టాలీవుడ్ మెగాస్టార్, పద్మవిభూషణ్ చిరంజీవి నివాళులర్పించారు. మీడియా సంస్థల అధినేత భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి అంజలి ఘటించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం చిరంజీవి మీడియాతో మాట్లాడారు. ప్రజారాజ్యం స్థాపించే సమయంలో ఆయన సలహాలు, సూచనల కోసం కలిసేవాడిని. రామోజీరావు మరణం తెలుగు రాష్ట్రాలకు తీరని లోటు. ఆయన మరణంతో తెలుగు జాతి ఓ పెద్దదిక్కును కోల్పోయింది. రామోజీరావు కలలను, ఆశయాలను కుటుంబ సభ్యులు ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటున్నాను.

చిరంజీవి







శ్రీ రామోజీ రావు గారు లాంటి దార్శనీకులు నూటికో కోటికో ఒకరు. మీడియా సామ్రాజ్యాధినేత మరియూ భారతీయ సినిమా దిగ్గజం అయినటువంటి ఆయన లేని లోటు ఎప్పటికీ పూడ్చలేనటువంటిది. ఆయన మన మధ్యన ఇక లేరు అనే వార్త చాలా బాధాకరం. 'నిన్ను చూడాలని' చిత్రంతో నన్ను తెలుగు సినీ పరిశ్రమకి పరిచయం చేసినప్పటి జ్ఞాపకాలు ఎప్పటికి మరువలేను. ఆ మహనీయుడి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను.

జూ.ఎన్టీర్

ఈనాడు గ్రూప్ చైర్మన్ రామోజీ రావు మృతిపట్ల టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఎమోషనల్ పోస్ట్ చేశాడు. రామోజీ రావు గారి మరణవార్త విని చాలా బాధపడ్డాను. ఈనాడు గ్రూప్ చైర్మన్ రామోజీ రావు మృతిపట్ల టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఎమోషనల్ పోస్ట్ చేశాడు. రామోజీ రావు గారి మరణవార్త విని చాలా బాధపడ్డాను. నేను గౌరవించే స్ఫూర్తిదాయక వ్యక్తుల్లో ఆయన ఒకరు. మీడియా, సినిమా, ఇతర రంగాలకు ఆయన చేసిన సేవలు మరువలేనివి. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా అన్నారు.

- అల్లు అర్జున్

నాడు గ్రూప్ చైర్మన్ రామోజీ రావు మృతిపట్ల టాలీవుడ్ దర్శక దిగ్గజం రాజమౌళి సంతాపం తెలిపారు. ఈ నేపథ్యంలో ట్వీట్ ద్వారా నివాళులు అర్పించారు. ఒక మనిషి అనేక రంగాల్లో వివిధ సంస్థలు స్థాపించి వాటిని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లాడు. వాటిద్వారా ఎన్నో లక్షలమందికి జీవనోపాధి, ఆశలను అందించి మార్గదర్శకంగా నిలిచారు. అలాంటి వ్యక్తికి భారతరత్న ఇవ్వడమే సముచితమని రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాను అంటూ రాజమౌళి రాసుకొచ్చాడు. దీనిపై అల్లు అర్జున్ రిప్లయ్ ఇస్తూ.. నా మనసులో కూడా అదే భావన కలిగింది సార్. మీరు నా హృదయంతో మాట్లాడారు. దానికి గాత్రదానం చేసినందుకు ధన్యవాదాలు అంటూ బన్నీ తెలిపాడు.

ఎస్.ఎస్. రాజమౌళి

ఈనాడు సంస్థల అధినేత, రామోజీ ఫిల్మ్ సిటీ రూపకర్త, తెలుగు ప్రజలందరికీ ఎనలేని స్ఫూర్తి ప్రదాత శ్రీ రామోజీ రావు గారి కి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఆయన కుటుంబానికి మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము!

సీతార ఎంటర్ టైన్ మెంట్

శ్రీ రామోజీ రావు గారు భారతీయ మీడియా మరియూ చలనచిత్ర పరిశ్రమకు చేసిన సేవలు చరిత్రపుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడుతాయి. ఆయన ఆత్మకు శాంతి చేగూర్చాలని ప్రార్థిస్తున్నాను. ఆయన కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి.

కల్యాణ్ రామ్

మాకే కాదు మా ముందుగా తరాలకి కూడా ఒక స్ఫూర్తిదాత రామోజీ రావు గారు. ఆయన మరణం తెలుగు రాష్ట్రాలకే కాదు భారత దేశానికి కూడా తీరని లోటు.

మంచు విష్ణు

"ఈనాడు" అనే పత్రిక స్థాపించి అటు ప్రజల్లో ఇటు రాజకీయాల్లో ఎంతో చైతన్యం తీసుకువచ్చారు. "ఈ ఉషా కిరణాలు " అంటూ ఎన్నో సందేశత్మక చిత్రాలు నిర్మించి.... సమాజాన్ని ప్రభావితం చేశారు. "రామోజీ ఫిల్మ్ సిటీ " తో తెలుగు చిత్ర పరిశ్రమ కి ఒక బ్రాండ్ ని తీసుకువచ్చారు. అలాంటి ఒక గొప్ప మనిషి మనకి దూరమవ్వడం చాలా బాధాకరం. ఆయన ఆత్మ కి శాంతి కలగాలని ఆశిస్తూ.. అయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి ని తెలియచేస్తున్నాను

అనీల్ రావిపూడి

పాత్రికేయ రంగంలో ఎనలేని కీర్తి ప్రతిష్టలు సంపాదించి, రామోజీ ఫిల్మ్ సిటీతో సినీ రంగాని అభివృద్ధి బాటలో నడిపించి, తాను ఉన్న ప్రతి రంగంలో తారా స్థాయికి చేరి, స్వర్గస్థులు అయిన శ్రీ రామోజీ రావు గారి కి శ్రద్ధాంజలి. ఆయన కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతి.

సాయిధరమ్ తేజ్

ఈనాడు పత్రికాధినేత, ప్రముఖ నిర్మాత, వ్యాపారవేత్త శ్రీ రామోజీరావు గారు మృతి పట్ల తెలంగాణ రాష్ట్ర ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రగాడ సంతాపం తెలియజేసింది. ఈరోజు ఉదయం ఆయన హఠాన్మరణం అందరినీ తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని, భారతీయ చలనచిత్ర పరిశ్రమ, మీడియా పరిశ్రమ, వినోద పరిశ్రమకు ఆయన చేసిన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలంగాణ స్టేట్ ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ సునీల్ నారంగ్ అన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నామని చెప్పారు. ఈ కోలుకోలేని నష్టాన్ని అధిగమించే శక్తిని మరియు ధైర్యాన్ని వారి కుటుంబానికి ఇవ్వాలని శ్రీ రామోజీరావు గారి కుటుంబ సభ్యులందరికీ మా సానుభూతి తెలియజేస్తున్నాం అన్నారు.

అధ్యక్షులు :: సునీల్ నారంగ్ , కార్యదర్శి :: కె అనుపమ్ రెడ్డి

ఈనాడు సంస్థల చైర్మన్, రామోజీ ఫిల్మ్ సిటీ స్థాపించి, విజయానికి మారుపేరు గా నిలిచిన శ్రీ రామోజీ రావు గారి కి మా నివాళులు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఆయన ఆత్మ కు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాము.

ఫర్ ట్యూన్ ఫోర్ సినిమాస్

ఏ రంగంలో అయినా, ఎలాంటి నేపథ్యం లేకపోయినా కష్టపడితే చాలు... విజయం దక్కుతుంది అనే స్ఫూర్తిని నాలాంటి ఎంతోమందికి పంచిపెట్టిన రామోజీరావు గారి జన్మ ధన్యం. తెలుగు కీర్తిని, స్ఫూర్తిని ప్రపంచానికి చాటి చెప్పిన రామోజీరావు గారి మరణం ఈ దేశానికి, ముఖ్యంగా తెలుగు జాతికి తీరని లోటు.

- సి.అశ్వనీదత్ (నిర్మాత)







పత్రికా రంగంలో చెరగని ముద్ర వేసిన ఈనాడు సంస్థల అధినేత, దిగ్గజ పాత్రికేయులు రామోజీరావు గారి మరణం అత్యంత బాధాకరం. ఈ రోజు రాజమండ్రిలో గేమ్ ఛేంజర్ చిత్రీకరణ చేస్తున్న రామ్ చరణ్... రామోజీ రావు గారికి అశ్రు నివాళులు అర్పించారు. ఆయనతో పాటు దర్శకులు శంకర్, నటులు సునీల్ రఘు కారుమంచి ఇతర చిత్ర బృంద సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. రామోజీరావు గారి మరణం తెలుగు ప్రజలకు తీరని లోటు అని తెలిపారు.

గేమ్ ఛేంజర్ చిత్రీకరణలో రామోజీ రావు గారికి అశ్రు నివాళ్లు అర్పించిన రామ్ చరణ్ - దర్శకుడు శంకర్

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.